## బౌద్ధ స్తూపానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- బుద్ధవనం ప్రత్యేకాధికారి లక్ష్మయ్యతో కలిసి సందర్శన

7





ఎస్ఎన్సీయూ విభాగం

# శిశువులకు.. సంజీవని

- చిన్నారులకు సేవలందిస్తున్న భద్రాచలం నవజాత శిశు చికిత్స కేంద్రం
- 13ఏళ్లలో 21,565 మంది పసిబిడ్డలకు అధునాతన వైద్యం
- ఏజెన్సీ సరిహద్దుల్లోని నాలుగు రాష్ట్రాల వారికి సేవలు
- కేంద్రం ఏర్పాటై నేటికి పదమూడేళ్లు పూర్తి

వివిధ సమస్యలతో వచ్చే ఏజెన్సీ ప్రాంత శిశువులకు అధునాతన వైద్యం అందిస్తూ భద్రాచలం నవజాత శిశు చికిత్స కేంద్రం సంజీవనిలా నిలుస్తోంది. నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లోని ఏజెన్సీ డివిజన్ కేంద్రమైన భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో 13ఏళ్ల క్రితం ఏర్పాటైన ప్రత్యేక నవజాత శిశు చికిత్స కేంద్రం (ఎస్ఎన్సీయు) ఏజెన్సీ ప్రాంతంలోని శిశువులకు ప్రాణం పోస్తోంది. వివిధ సమస్యలతో తీసుకొచ్చే శిశువులకు ఇక్కడ వైద్యం అందించేందుకు అధునాతన వైద్య పరికరాలతో పాటు వైద్యులు అందుబాటులో ఉన్నారు. దీంతో వారికి అత్యవసర వైద్యం సకాలంలో అందుబాటులోకి వస్తుండటంతో వేలాది మంది శిశువులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

భద్రాచలం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ వైద్యశాలల్లో రూ.వేలు, రూ.లక్షలతో అయ్యే ఖర్చు ఇక్కడ పూర్తి ఉచితంగా అందుతుండటంతో తెలంగాణతో పాటు సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నిరుపేదలు తమ చిన్నారులను ఇక్కడ వైద్యం కోసం ఆశ్రయిస్తున్నారు. ఇలా 13 ఏళ్లలో 21,565 మంది చికిత్స నిమిత్తం చేరారు. ఇందులో ఏరియా వైద్యశాలలోనే జన్మించిన 14,814 మంది, ఇతర చోట్ల జన్మించిన 6,751 మంది శిశువులు ఇక్కడ చేరి చికిత్స పొందారు. 21,565 మందిలో 17,718 మంది శిశువుల ఆరోగ్యం కుదుట పడటంతో క్షేమంగా ఇంటికి వెళ్లారు. ఇదిలా ఉండగా పరిస్థితి విషమించి చివరి సమయంలో చికిత్స కోసం చేరిన వారిలో 1,371 మంది శిశువులు మృతి చెందారు. వైద్యులు మరికొద్ది సమయం ఉంచమని సూచించినా వినకుండా 1,375 మంది శిశువులను తీసుకెళ్లారు. కాగా 156 మంది శిశువులను వారి కుటుంబ సభ్యులు అధికారులకు ఏ మాత్రం సమాచారం ఇవ్వకుండా బయటకు తీసుకెళ్లారు.

### 13 ఏళ్ల క్రితం పది.. నేడు 20పడకలు

ఏజెన్సీ ప్రాంతంలో జన్మించిన శిశువుల్లో చలామంది తక్కువ బరువు, పౌష్టికాహార లోపంతో బాధపడేవారున్నారు. వీరికి భద్రాచలంలోని నవజాత శిశు కేంద్రంలో చికిత్స అండగా నిలుస్తోంది. దీంతో చిన్నారులు పూర్తిస్థాయిలో ఆరోగ్యవంతులవుతున్నారు. 2012 ఆగస్టు 8న అప్పటి ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి నవజాత శిశు కేంద్రాన్ని ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు వేలాది మంది చిన్నారులకు క్లిష్ట సమయంలో వైద్య చికిత్స అందించారు. కాగా ఏజెన్సీ ప్రాంతంలో నవజాత శిశు కేంద్రంలో శిశువులకు మెరుగైన సేవలందుతుండటంతో ఆరంభంలో పది పడకలతో ఉన్న ఎస్ఎన్సీయులో పడకల సంఖ్య 2017లో 20 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదన వెళ్లిన క్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ ఇందుకు సానుకూలంగా స్పందించింది. పది పడకలకు అదనంగా మరో పది పడకలను మంజూరు చేయడంతో భద్రాద్రి ఎస్ఎన్సీయూలో వైద్య సేవలు మరింత అందుతున్నాయి.

| గత ఐదేళ్లలో చికిత్స పొందిన శిశువుల వివరాలు | | | |
|---|---|---|---|
| సంవత్సరం | చేరిన వారు | చికిత్స పొందిన వారు | మృతిచెందిన వారు |
| 2020 | 1513 | 1203 | 87 |
| 2021 | 1747 | 1363 | 123 |
| 2022 | 1543 | 1289 | 98 |
| 2023 | 1366 | 1261 | 64 |
| 2024 | 1689 | 1520 | 73 |
| 2025ఆగస్టు | 811 | 762 | 37 |

### పుట్టిన నాటి నుంచి నెలలోపు వారికి..

ఎస్ఎన్సీయూలో పుట్టిన నాటి నుంచి నెలలోపు శిశువులకు అత్యాధునిక వైద్యం అందించడం జరుగుతోంది. కాగా కీలకమైన నవజాత శిశు కేంద్రాల్లో సంక్లిష్ట సమయాల్లో వెంటిలేటర్ లేక శిశువులు మృత్యువాత పడుతున్న విషయాన్ని గుర్తించి ప్రభుత్వం మూడు వెంటిలేటర్లను ప్రత్యేకంగా ఎస్ఎన్సీయూకు మంజూరు చేయడంతో అవి సంక్లిష్ట సమయంలో శిశువులకు (మిగతా 6వ పేజీలో)



పరీక్షిస్తున్న పిల్లల వైద్య నిపుణుడు



## ఖమ్మంలో.. 'పాలస్తీనాకు సంఘీభావం' ర్యాలీ

- గాజాలో జరిగిన దారుణ ఘటనలను చూపుతూ భారీ ప్రదర్శన
- ఇజ్రాయెల్ దాడులపై వక్తల మండిపాటు
- ఈవిషయంలో ప్రధాని మోదీ నిర్ణయం మార్చుకోవాలని డిమాండ్

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాలోని గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు నిరసనగా.. పాలస్తీనాకు సంఘీభావంగా గురువారం ఖమ్మంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలవడాన్ని నిరసిస్తూ... మోదీ తన నిర్ణయం మార్చుకోవాలని, గాజాలో జరుగుతున్న హింసాకాండను నిలిపివేయాలని ఖమ్మంలో ప్రజా, యువజన, మహిళ, విద్యార్థి, మైనారిటీ సంఘాలతో పాటు పలు రాజకీయ పక్షాలు, ప్రైవేటు విద్యాసంస్థల ఆధ్వర్యంలో భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలు, సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ ప్రజాపంథా, మాస్‌లైన్, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. పెవిలియన్‌గ్రౌండ్ నుంచి (మిగతా 6వ పేజీలో)

## పండుగల కళ

నేడు వరలక్ష్మీ వ్రతం
రేపు రక్షాబంధన్



- రెండు పండుగలతో పట్టణాలు, పల్లెల్లో సందడి
- ప్రత్యేక పూజలకు ముస్తాబైన ఆలయాలు
- పూజాసామగ్రి, రాఖీల కొనుగోళ్లతో దుకాణాల్లో రద్దీ

7





షెడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

## శరవేగంగా..

- చురుగ్గా ఖమ్మం మోడల్ మిర్చి మార్కెట్ పనులు
- రూ. 155.30కోట్లు.. ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మాణం
- సంక్రాంతి నాటికి ప్రారంభానికి చర్యలు

ఖమ్మం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మిర్చిసాగులోనే ప్రత్యేక గుర్తింపు ఉన్న ఖమ్మం జిల్లాకు ప్రపంచస్థాయి ప్రమాణాలతో.. అధునాతన హంగులతో మోడల్ మిర్చి యార్డు రాబోతోంది. పాత మిర్చియార్డుస్థానంలో దేశానికే మోడల్‌గా నిలవబోయే కొత్త మిర్చి మార్కెట్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ. 155.30కోట్లతో ఈ మార్కెట్ పనులు చేపట్టారు. రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మంలో దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచేలా మార్కెట్ ఉండాలన్న యోచనతో ప్రత్యేకంగా డిజైన్ చేయించారు. అయితే ఇంకా ఈమార్కెట్ పనులకు అధికారికంగా శంకుస్థాపన చేయకపోయినా నిర్ణీత గడువులోపు పూర్తిచేసే లక్ష్యంతో పనులు నిర్వహిస్తున్నారు. మొత్తం 15.39 ఎకరాల్లో ఏడు ప్రత్యేక షెడ్లను నిర్మిస్తున్నారు. ఇందులో ఒక షెడ్ జీప్లస్ 1 కింద నిర్మిస్తుండగా.. 2.30లక్షల బస్తాలు పట్టేలా ఏసీ మిర్చి గోదాం షెడ్‌ను నిర్మిస్తున్నారు.

### వర్షానికి, గాలిదుమారానికి నష్టం లేకుండా

1935లో ప్రారంభమైన ప్రస్తుత ఖమ్మం వ్యవసాయమార్కెట్ 1954లో పూర్తిస్థాయి మార్కెట్ యార్డుగా రూపాంతరం చెందింది. మిర్చితో పాటు పత్తి, అపరాలు, మొక్కజొన్నలు కొనుగోలు నడుస్తున్నాయి. అయితే ఖమ్మం మిర్చియార్డు గుంటూరు తర్వాత తెలంగాణలో ప్రసిద్ధి చెందిన మార్కెట్. ఇక్కడ తేజ మిర్చి కూడా అధికంగా ఉత్పత్తవుతుంది. ఖమ్మం మార్కెట్‌కు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలతో పాటు ఏపీలోని కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల రైతులు ఇక్కడ మిర్చి అమ్ముతున్నారు. సుమారు రూ.4వేల కోట్లు ఇక్కడ మిర్చి టర్నోవర్ జరుగుతోంది. ఖమ్మం నుంచి మిర్చి చైనా, సింగపూర్, మలేషియా, హాంకాంగ్, బంగ్లాదేశ్ తదితర దేశాలకు దేశంలోని పలు రాష్ట్రాలకు ఎగుమతవుతుంది. ఇక్కడ 200మందికిపైగా మిర్చి ఎగుమతి దారులు 500మందికిపైగా మిర్చి కమీషన్ ఏజెంట్లు ఇక్కడ మిర్చి వ్యాపారం నిర్వహిస్తున్నారు.

### అధునాతన వసతులు

ఖమ్మంలో రూ.155.30కోట్లతో నిర్మిస్తున్న మిర్చి మార్కెట్‌లో రైతులకు, వ్యాపారులతో పాటు పనిచేసే కార్మికులకు కూడా సకల సౌకర్యాలు కల్పించబోతున్నారు. ఇప్పటి వరకు ఆరుబయట మిర్చి (మిగతా 6వ పేజీలో)



మోడల్ మార్కెట్ నమూనా చిత్రం

## పంచాయతీ కార్యదర్శిపై విచారణకు ఆదేశాలు..?

- అధికారులను బురిడీ కొట్టించిన విషయంపై జిల్లా అధికారులు సీరియస్
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఇంటెలిజెన్స్ ఆరా

ఖమ్మం రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండలం, కొండాపురం పంచాయతీ కార్యదర్శి ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో తప్పుడు అటెండెన్స్‌తో విధులకు హాజరుకాకుండా అధికారులను బురిడి కొట్టించాడు. ఈ విషయంపై తప్పుడు హాజరు... తప్పదు మూల్యం అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఆధారాలతో గురువారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా పంచాయతీ అధికారులు స్పందించారు. విధులకు హాజరుకాకుండానే హాజరైనట్లు తప్పుడు అటెండెన్స్‌తో విధులు నిర్వహించి అధికారులను బురిడి కొట్టించడంపై ఉన్నతాధికారులు సదరు పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. సదరు పంచాయతీ కార్యదర్శిపై వెంటనే విచారణ నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారులు కిందిస్థాయి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. అదేవిధంగా 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఇంటెలిజెన్స్ అధికారులు కూడా పంచాయతీ కార్యదర్శి గురించి ఆరా తీసినట్లు తెలిసింది. కార్యదర్శికి సంబంధించిన ఫేస్ యాప్ (మిగతా 6వ పేజీలో)

## మెట్ట పంటలకు.. వానగండం!

- మళ్లీ వర్షాభావ పరిస్థితులతో తల్లడిల్లుతున్న రైతులు
- పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు సాగునీటి సమస్య

ఖమ్మం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉమ్మడి జిల్లాలో మెట్ట పంటలకు వానగండం ఏర్పడింది. వర్షం పడినప్పుడు.. భారీగా పడటం.. తర్వాత ఎండాకాలంలోలా ఎండలు, ఉక్కపోత వాతావరణంతో రైతులతో పాటు ప్రజలు సతమతమవుతున్నారు. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు పనులు చేయలేక ఎండ ప్రభావానికి గురవుతున్నారు. ఖమ్మం జిల్లాలో ఒకవైపు సాగర్‌జలాలు విడుదలై వరినాట్లు పడుతున్నా.. అక్కడక్కడ ప్రాజెక్టులు నిండి సాగుకు అనుకూల వాతావరణం ఉన్నా.. ఇంకా చాలా చెరువులు నిండని పరిస్థితి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జూన్‌లో తక్కువ వర్షపాతం, జూలైలో అధిక వర్షపాతం నమోదవగా.. ఆగస్టులో వర్షాభావం నెలకొంది. వాస్తవానికి ఆగస్టులో భారీ వర్షాలు కురిసి చెరువులు, వాగులు, ప్రాజెక్టులు జలకళతో ఉండాల్సి ఉంది. వాతావరణం కూడా చల్లని గాలులతో ఉండాల్సి ఉండగా మండే ఎండలు, ఉక్కపోతతో విచిత్ర వాతావరణం ఉంది. ఉమ్మడి జిల్లాలో వరి, మొక్కజొన్నతో పాటుపెసర, కంది, మినుము తదితర పంటలు రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలో వానాకాలం సాగు కింద 6.34లక్షలపైగా ఎకరాలు సాగు లక్ష్యంకాగా ఇప్పటికే 4.54లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. ఇందులో సుమారు లక్షా 50వేల ఎకరాల్లో వరి, 2.20లక్షల ఎకరాల్లో పత్తి, 14,572 ఎకరాల్లో పెసర, 3800ఎకరాల్లో నువ్వులు, తదితర పంటలు వేశారు. జిల్లాలో ఆయిల్‌పామ్‌తో పాటు కూరగాయలు, మిర్చితోటలు వేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో జూన్‌లో 131.2మి.మీ. వర్షపాతానికి గాను 123.0మి.మీ, జూలైలో 186.3మి.మీ.గాను, 240.7మి.మీ. సగటు వర్షపాతం పడింది. ఆగస్టులో 249.0మి.మీ. వర్షపాతం కురవాలి. కానీ ఇప్పటి వరకు 20.3మి.మీ. స్వల్ప వర్షపాతమే నమోదైంది. జిల్లాలో ముదిగొండ, చింతకాని, ఖమ్మం అర్బన్, వైరా మండలాల్లో తీవ్రవర్షాభావం ఉండగా మిగిలిన మండలాల్లో సాధారణ వర్షపాతమే నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ కూడా సుమారు 4 లక్షల ఎకరాలకు పైగా రైతులు పంటలు వేసినప్పటికి కొన్ని మండలాల్లో వర్షాభావ పరిస్థితి నెలకొంది. భద్రాద్రి జిల్లాలో ఆగస్టులో 80.1మి.మి వర్షపాతం నమోదవాల్సి ఉండగా.. 27.9మిల్లీమీటర్లు మాత్రమే నమోంది. ఇక ఈ నెలలో పూర్తిస్థాయిలో వర్షాలు పడితేనే రైతులు వేసిన పంటల సాగుకు గ్యారంటీ కలగనుంది. చెరువులు నిండకపోవడం, రైతులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. సీతారామ కాలువ వెంట ఉన్న మోటార్లు ఆయిల్ ఇంజన్లతో రైతులు కొంత సాగునీటిని వినియోగించుకున్నారు. ఉమ్మడిజిల్లాలో పత్తి, మొక్కజొన్న పంటలు వేయగా ప్రస్తుతం మిర్చి, తదితర పంటలు వేస్తున్నారు. ఆయిల్‌పామ్, కూరగాయలు పంటలు వస్తున్నారు. వరుణదేవుడు కరుణిస్తేనే పంటలు బాగా పండే పరిస్థితి ఉంది. ఒకరోజు వర్షం పడడం, వారంరోజులు ఎండలు ఉండడం, తీవ్రంగా ఉక్కపోత వాతావరణం ఇటు మనుషులకు, అటుపంటలకు సైతం ఇబ్బంది కలిగిస్తోంది.



వానల్లేక వడబడిన పత్తి చేను

## తల్లడిల్లిన తోబుట్టువు

- డెంగ్యూతో తమ్ముడి మృతి..
- చివరి రాఖీ కట్టిన అక్క
- కిష్టాపురంలో కన్నీరు పెట్టించిన ఘటన

7

## నెల నెలా వెన్నెల వార్షిక సంబరాలు

- ఖమ్మంలో ప్రారంభమైన తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

6



ఎడారిలో వాన చినుకు నాటికలో ఓ సన్నివేశం

## సీతారామచంద్రస్వామికి వేద పారాయణం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి జప హోమాలు, వేద పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయంలోని యాగశాలలో స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేద మంత్రాలు, మేళతాళాల మధ్య నిర్వహించారు. ఈ నెల 4న పవిత్రోత్సవాలకు అంకురార్పణ నిర్వహించగా బుధవారం నాడు రామయ్యకు అష్టోత్తర శత కలశాభిషేకం, పవిత్రారోపణం నిర్వహించారు. కాగా గురు, శుక్రవారాల్లో జప హోమాలు, వేద పారాయణం నిర్వహిస్తున్నారు. 9న పూర్ణాహుతి గావించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, అర్చకులు అమరవాది వెంకట్రామన్, అమరవాది శ్రీకాంతాచార్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో భద్రాద్రికి ఐదు పతకాలు



పతకాలు సాధించిన భద్రాద్రి అథ్లెటిక్ క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఐదు పతకాలు వరించాయి. జనగామ జిల్లాలో ముగిసిన రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో జిల్లా నుంచి 15 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించగా రెండు బంగారు పతకాలు, ఒక రజత పతకం, రెండు కాంస్య పతకాలు గెలుపొందారు. పతకాలు పొందిన క్రీడాకారులను గురువారం జాతీయ చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్, జిల్లా యువజన క్రీడలు అధికారి ఎం.పరందామరెడ్డి, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ కె.సారంగపాణి, కోచ్‌లు పి.నాగేందర్, ప్రసాద్, శ్వేత, మల్లిఖార్జున, వీరభద్రంలను అభినందించారు.

**విజేతల వివరాలు**

పాల్వంచ కిన్నెరసానికి చెందిన కె.సోమాభద్రం 60 మీటర్ల పరుగు పందెంలో, కొత్తగూడెంకు చెందిన బి.శైలేష్ కిడ్స్ జావెలిన్ త్రోలో (బంగారు పతకం), పాల్వంచకు చెందిన బి.విద్యశ్రీ జావెలిన్ త్రో, కిన్నెరసానికి చెందిన వి.వాసు 60 మీటర్ల పరుగు పందెంలో (కాంస్య పతకం) సాధించారు.

# ఘనంగా నెల నెలా వెన్నెల వార్షిక సంబరాలు

**ఖమ్మంలో ప్రారంభమైన తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు**



నాటిక పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నెల నెలా వెన్నెల 8వ వార్షిక సంబురాలు ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో గురువారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా నాలుగు రోజుల పాటు తలపెట్టిన తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలకు నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. ప్రారంభసభలో నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్ రావు, కొత్తూరు. దేవేంద్ర, చీఫ్ ప్యాట్రన్ నాగబత్తిని రవి, కురువెళ్ల ప్రవీణ్, వేల్పుల.విజేత, వేముల సదానంద్ హాజరై మాట్లాడారు. అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ (ఆర్ట్స్), ఖమ్మం కళా పరిషత్, ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో స్థానిక కళాకారులు, ఇతర కళాకారులతో ప్రాచీన కళలను, కథలను నిర్వహిస్తూ కళాకారులకు గుర్తింపువచ్చేలా ఈ నాటిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ప్రతీ నెల నిర్వహించే నెలనెల వెన్నెల కార్యక్రమానికి, ఈ నాలుగు రోజుల పాటు జరిగే నాటిక పోటీలకు సహకరిస్తున్నారన్నారు. గురువారం తొలిరోజున కంచర్ల శ్రీనివాస్ రాసిన గీతాన్ని ఆలపించారు. అనంతరం ఎడారిలో వాన చినుకు నాటిక ప్రదర్శించారు. దీంతో పాటు మిగిలిన మూడురోజుల్లో హైదరాబాద్ కళాంజలి, కరీంనగర్‌కు చెందిన చైతన్యకళాభారతి, విజయవాడ మైత్రి కళానిలయం, న్యూస్టార్ మోడ్రన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తాడేపల్లికి చెందిన ఐపేట్ ఇండియా, అరవింద ఆర్ట్స్, హైదరాబాద్‌కు చెందిన మిత్రా క్రియేషన్స్, విశాఖపట్నానికి చెందిన గోవాడ క్రియేషన్స్, చైతన్య కళాస్రవంతి సంస్థల ఆధ్వర్యంలో పలు నాటికలు ప్రదర్శించనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

# భోజనం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి విజయలక్ష్మీబాయి**


సమావేశంలో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ విజయలక్ష్మీబాయి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : 2025 - 26 విద్యా సంవత్సరానికి గాను పెండింగ్ పనులు తక్షణమే పూర్తి చేయాలని అడిషనల్ డైరెక్టర్, ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి (విద్యా) బి.విజయలక్ష్మీబాయి విద్యాశాఖాధికారులను ఆదేశించారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెంలో వివిధ పాఠశాలలను సందర్శించారు. అనంతరం జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జ్ డీఈవో బి.నాగలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి విజయలక్ష్మీబాయ్ మాట్లాడుతూ అపార్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, యూడైస్‌లో విద్యార్థుల పేర్లు నమోదు చేయాలని కోరారు. మధ్యాహ్నభోజనం విషయంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వంటలు చేసే ప్రాంతంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలని, ఆహార పదార్థాలు ఎలాంటి కలుషితం కాకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్ టెస్టు మండల స్థాయిలో ప్రగతి నివేదికలు రూపొందించాలన్నారు. భవిత కేంద్రాల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, భవన నిర్మాణ పనులు, మరమ్మతులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. భవిత కేంద్రాలకు అందించిన నిధులు సక్రమంగా వినియోగించాలని, కేజీబీవీల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, కేజీబీవీల్లో ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా తరగతుల నిర్వహన సక్రమంగా జరగాలని, బాలికలకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా చూడాలన్నారు. యూఆర్ఎస్ నిర్వహణ, విద్యార్థుల నమోదు పెంచడానికి తీసుకున్న చర్యలు, నిధులు వినియోగం, ఇతరాత్ర విషయాలపై సంబంధిత అధికారులతో ఆమె చర్చించారు. పాఠశాలల మౌళిక వసతులు, స్థితిగతులు, పనుల పురోగతిపై హెచ్ఎంలను, ఎంఈవోలను అడిగి తెలుసుకున్నారు. అపక్, ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు, ఉపాధ్యాయుల హాజరుశాతం, ఎఫ్ఎల్ఎన్ఏఐ కార్యక్రమాల నిర్వహణ, విద్యార్థుల అభ్యసన స్థాయిలు, కంప్లెక్స్ సమావేశాలపై అధికారులతో చర్చించారు. ఈ ఏడాది పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, గత ఏడాది నమోదు కన్నా తగ్గుదలపై మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి బి.నాగలక్ష్మి, ఎంఈవోలు, సెక్టోరియల్ కో ఆర్డినేటర్లు హెడ్‌మాస్టర్లు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ఉద్దీపకం-2 వర్క్‌బుక్ నిర్వహణ తీరును పరిశీలించాలి

**ప్రభుత్వం నిర్దేశించిన మెనూను మాత్రమే పాఠశాలల్లో అమలు చేయాలి**

**భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్**


ప్రసంగిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న పీజీహెచ్‌ఎంలు మీ పాఠశాలల్లో ఉన్న జీపీఎస్ పాఠశాలల పిల్లలతో పాటు ఉద్దీపకం-2 వర్కుబుక్ నిర్వహణ విద్యార్థులకు ఏ విధంగా బోధిస్తున్నది పరిశీలించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో పీజీహెచ్‌ఎం, హెచ్‌ఎంలతో ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్ పాఠశాలల్లో అమలు చేస్తున్న మెనూ పాఠశాలల్లో జరిగే పరిణామాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 3, 4, 5 తరగతుల ప్రైమరీ స్కూళ్లల్లో చదివే పిల్లలపై కూడా ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని అన్నారు. ప్రతి ఆశ్రమ పాఠశాలల్లో గత ఏడాది ప్రవేశపెట్టిన ఉద్దీపకం వర్క్‌బుక్ వలన విద్యార్థుల విద్యాభ్యాసం కొంత మెరుగుపడినట్లు అనిపిస్తుందని, ఈసారి ప్రవేశపెట్టిన ఉద్దీపకం -2 వర్క్‌బుక్‌లోని అంశాలు ప్రతి విద్యార్థి అర్థం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని అన్నారు. మన పాఠశాలల్లో జరిగే ప్రతి సంఘటన నాకు తెలుస్తోందని అంతేకాదు సీఎంవో వరకు కూడా సమాచారం వెళ్లుతుందని మన పాఠశాలలను సీఎంవోతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా మానిటరింగ్ చేస్తున్నారని చెప్పారు. పాఠశాలల్లో ఏమైనా చిన్న చిన్న రిపేర్లు ఉంటే వాటికి సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా హెచ్‌ఎం, వార్డెన్లు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏసీఎంవో రమేష్, ఏటీడీవోలు అశోక్‌కుమార్, చంద్రమోహన్, రాధమ్మ పాల్గొన్నారు.

## 90వ పుట్టిన రోజుకు 90 మొక్కలు నాటిన స్వాతంత్ర్య సమరయోధుడు


మొక్కలు నాటుతున్న స్వాతంత్ర్య సమరయోధుడు కృష్ణమూర్తి

ఇల్లెందు టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : తన 90వ పుట్టిన రోజుకు 90 మొక్కలు నాటి ఆదర్శంగా నిలిచారు. ఇల్లెందు పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన చాగంటి కృష్ణమూర్తి తన 90వ పుట్టిన రోజు సందర్భంగా గురువారం జడ్పీ కీర్తి చంద్రికారెడ్డి, కమ్మ మహజన సంఘం నాయకులతో కలిసి డివైడర్‌పై 90 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కమ్మ మహజన సంఘం అధ్యక్షుడు ఉప్పుగండ్ల రవీందర్, కార్యదర్శి కొమ్మినేని రమేష్, కోశాధికారి జె.వేణుప్రసాద్, ప్రచార కార్యదర్శి దుద్దుకూరి సుమంత్, సహాయ కార్యదర్శి గుజ్జర్లపూడి రాంబాబు, కమ్మ మహజన సంఘం పెద్దలు కనగాల పేరయ్య, నామా సుధాకర్, నేలవెల్లి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో కోర్టు భవనాలకు భూమిపూజ


నూతన భవనాలకు భూమిపూజ చేస్తున్న జిల్లా జడ్జి

మధిర, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మధిరలో రూ.24 కోట్లతో నిర్మించే కోర్టు భవన నిర్మాణ పనులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ గురువారం భూమిపూజ నిర్వహించారు. దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు నిజాంరాజు 1930లో మధిరలో ఒకే ప్రాంగణంలో కోర్టు భవనంతో పాటు సబ్‌జైలును నిర్మించారు. ఈ భవనాలను నిర్మించి దాదాపు వంద ఏళ్లు కావస్తుండటంతో శిథిలావస్థకు చేరాయి. మధిరకు నూతనంగా సబ్ కోర్టు కూడా మంజూరు కావడంతో, మధిర శాసనసభ్యుడు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నూతన కోర్టు భవనాల నిర్మాణానికి రూ.24 కోట్లు నిధులను మంజూరు చేయించారు. గతేడాది అక్టోబర్‌లో హైకోర్టు న్యాయమూర్తి, ఖమ్మం జిల్లా పోర్ట్ పోలియో జడ్జి శ్రీసుధ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ మేకు నేడు ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మధిర కోర్టు న్యాయమూర్తులు ఎన్.ప్రశాంతి, వేముల దీప్తి, టౌన్ సీఐ రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## చింతమొక్క ఎందుకు తిరుగుతోంది?


గుండ్రంగా తిరుగుతున్న చింతమొక్క ఇదే..

ములకలపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ములకపల్లి మండలం సీతారాంపురం ఎస్సీ కాలనీలో ఓ ఇంట్లో బుధవారం చింత మొక్క తానంతట తానే గుండ్రంగా తిరిగిన ఘటన చర్చనీయాంశమైంది. ఈ మొక్క గుండ్రంగా తిరుగుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో చుట్టుపక్కల ప్రాంతాల వారు కూడా వచ్చి ఆసక్తిగా తిలకిస్తున్నారు. గురువారం కూడా ఆ మొక్క అలాగే తిరుగుతుండగా.. దానికి గల కారణాలు అంతుపట్టని పరిస్థితి. ఈ క్రమంలో శుక్రవారం శాస్త్రవేత్తల బృందం సీతారాంపురం రానుందని, మొక్క తిరగడానికి గల కారణాలను అన్వేషిస్తుందని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే గావిట్రోప్రిజం లేదా జియోట్రోపిజం గురుత్వాకర్షణకు ప్రతిస్పందనగా మొక్క పెరుగుదల లేదంటే కదలిక ఉంటుందని భద్రాద్రి జిల్లా రిటైర్డ్ సైన్స్ అధికారి ఎస్ చలపతిరాజు చెబుతున్నారు. ఉద్దీపన గురుత్వాకర్షణ, స్టాటోసైట్లు ప్రత్యేక కణాలు ఉన్న క్రమంలో కూడా మొక్కల్లో ఇలాంటి కదలికలు ఉంటాయని, అలాగే మొక్కలో ఆక్సిన్ (హార్మోన్ల) ప్రభావం కూడా ఉండొచ్చని ఆయన పేర్కొన్నారు.

# శరవేగంగా..

(5వ పేజీ తరువాయి)

బస్తాలుంటుండటంతో అకాలవర్షాలు, గాలిదుమారాలు వచ్చినప్పుడు అవి తడిచి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. మిర్చిపంట తడవడంతో నాణ్యత సాగకుడా చూపి వ్యాపారులు ధర తగ్గిస్తున్నారు ముందు ఈపరిస్థితి లేకుండా మొత్తం ఏడు భారీ షెడ్లు నిర్మించి రైతులు తమ బస్తాలు షెడ్లలో ఉంచి అమ్ముకునే అవకాశం కల్పిస్తున్నారు. ఒక షెడ్డులో పైన రైతులకు విశ్రాంతిభవనం, వ్యాపారుల కార్యకలాపాలు నిర్వహణకు ఏర్పాట్లు, హమాలీలు, దడవాయిలుకు విశ్రాంతి గదులు కూడా ఏర్పాటు చేస్తున్నారు. అలాగే మార్కెట్ సమాచారం తెలిపేలా డిజిటల్ బోర్డులు ఏర్పాటు కానున్నాయి. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈమార్కెట్‌ను దుబాయికి చెందిన ఎజిలిటీ అనే అంతర్జాతీయ నిర్మాణ సంస్థ పనులు చేపట్టింది. ప్రస్తుతం 50వేలబస్తాల మిర్చి అమ్మకాల సౌలభ్యంతో ఉన్న మిర్చి మార్కెట్‌ను 2.30లక్షల బస్తాలు అమ్మేలా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు క్యాంటీన్, బ్యాంక్, పీహెచ్‌సీ లాంటి సదుపాయాలు కూడా ఇక్కడ కల్పించనున్నారు.

**ఈ మిర్చి మార్కెట్ దేశానికి మోడల్**

**వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ఖమ్మంలో నిర్మిస్తున్న మిర్చి మార్కెట్ దేశానికి మోడల్ కాబోతోంది. మిర్చిసాగుకు, వ్యాపారానికి గుంటూరు తర్వాత ఖమ్మానికి గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఉన్న మార్కెట్‌లో సౌకర్యాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అందుకే మార్కెట్‌కు చుట్టూ అవసరమైన చోట ప్రత్యేకంగా గేట్లు ఏర్పాటు చేస్తున్నాం. లారీలు, వాహనాలు తిరిగేందుకు 8 గేట్లు, చుట్టూ రహదారులు కూడా నిర్మిస్తున్నాం. రైతు మార్కెట్‌కు మిర్చి బస్తాలు తెచ్చిన తర్వాత పంటకు ఎలాంటి నష్టం లేకుండా మార్కెట్ భరోసా కల్పించనుంది. సంక్రాంతి నాటికి ఈ మార్కెట్‌ను తిరిగి పునఃప్రారంభిస్తాం.

**ఇది అందరికీ సౌలభ్యం**

**యరగర్ల హనుమంతరావు, ఖమ్మం ఏఎంసీ చైర్మన్**

ఖమ్మంలో నిర్మిస్తున్న మిర్చి మార్కెట్ రైతులకు, వ్యాపారులకు, కార్మికులకు, ఉద్యోగులకు సౌకర్యంగా ఉండనుంది. దేశంలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ మిర్చి మార్కెట్ కొత్తది నిర్మిస్తున్నాం. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పాత మార్కెట్ స్థానంలో రూ.155.30కోట్లతో ఈమార్కెట్‌ను నిర్మిస్తున్నాం. దేశంలో రైతులంతా వచ్చి ఈమార్కెట్‌ను చూసి వెళ్లాలన్నది మంత్రి తుమ్మల ఆకాంక్ష. అది త్వరలోనే నెరవేరబోతోంది.

# ‘కగార్’ హత్యలను ‘సుప్రీం’ సుమోటోగా తీసుకోవాలి

**బస్తర్ అడవుల్లో ఎన్‌కౌంటర్ల పేరుతో 600 మందిని చంపారు**

**ఆదివాసీల హననంలో మోదీ, షాలే ప్రధాన ముద్దాయిలు**

**పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్**


మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్

ఇల్లెందు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బస్తర్ అడవుల్లో 57 ఎన్‌కౌంటర్‌ల పేరిట 600మందిని కాల్చి చంపారని, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ ఆదివాసీల హననానికి పాల్పడుతున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలే ప్రధాన ముద్దాయిలని రాష్ట్ర పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణరావు మండిపడ్డారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లెందులో గురువారం జరిగిన ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక విస్తృత సమావేశంలో వారు మాట్లాడారు. అవన్నీ ప్రభుత్వ హత్యలేనని, సుప్రీంకోర్టు సుమోటో కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. 18నెలలుగా బస్తర్‌లో సాగుతున్న ఆదివాసీల హత్యాకాండలో ఆరునెలల పసిబిడ్డ మంగ్లీసోడి నుంచి మావోయిస్టు నేత నంబాల కేశవరావు వరకు 600మందిని కేంద్ర బలగాలు కాల్చి చంపాయని, నిజాలు బాహ్యప్రపంచానికి తెలియనీయడంలేదని, బస్తర్‌ను నిషేధిత ప్రాంతంగా ప్రకటించి నిజనిర్ధారణ బృందాలను వెళ్లనీయడం లేదని ఆరోపించారు. 50ఏళ్లుగా పౌరహక్కుల సంఘాలు వెల్లడించిన నిజానిర్ధారణ అంశాలు వివిధ రాష్ట్రాల శాసనసభలు కూడా చర్చించాయని పేర్కొన్నారు. బస్తర్ హత్యాకాండపై న్యాయస్థానాలు సైతం స్పందించకపోవడం శోచనీయమని, అమానుషంగా కోర్టు హత్యలు గావిస్తున్న మోదీ, అమిత్‌షాలపై సుప్రీంకోర్టు సూమోటోగా కేసులు నమోదు చేయాలని కోరారు. ప్రజల కోసం, రాజ్యాంగ హక్కుల కోసం సాయుధ పోరాటం చేయడం నేరమెలా అవుతుందని, వారిని చంపే అధికారం ఎవరిచ్చారని నిలదీశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రజాహిత సంస్థలు, పార్టీలు, మేధావులు, ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసుల ప్రాణాలను హరిస్తుంటే వారికి తిరుగుబాటు తప్ప వేరే గత్యంతరంలేదన్నారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం ఏర్పడిన ఆదివాసులు సంఘీభావ వేదిక వరంగల్‌లో ఈనెల 24న, ఇల్లెందులో అక్టోబరు 5న ఉమ్మడి జిల్లాల సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులకు టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రొఫెసర్ హరగోపాల్. బాటియా, సోనిసోరి, గుమ్మడి నర్సయ్య, వివిధ పార్టీలు, వామపక్షాల నాయకులు, విప్లవ, సామాజిక సంస్థలు, మేధావులు పాల్గొంటారన్నారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ సంఘీభావ వేదిక జిల్లా నాయకుడు గుంపిడి వెంకటేశ్వర్లు అధ్యతన జరిగిన కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు రమణా, లక్ష్మయ్య, రాంటేకి అశోక్, వీరభద్రం, ముక్తి సత్యం, గీత, చిర్రా రవి, ప్రశాంత్, వసంతరావు పాల్గొన్నారు.

# శిశువులకు.. సంజీవని..

(5వ పేజీ తరువాయి)



ప్రత్యేక నవజాత శిశు చికిత్స కేంద్రం

ప్రాణం పోస్తున్నాయి. అదేవిధంగా రేడియెంట్ వార్మర్స్ 24, సిపాప్ రెండు, ఫొటోథెరపీ యూనిట్లు 17 ఉన్నాయి. దీంతో శిశువులకు ఏజెన్సీ డివిజన్ కేంద్రంలోనే కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు వెసులుబాటు ఏర్పడింది. ఇక్కడ భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతం నుంచి వచ్చే వారికే కాకుండా చత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వస్తున్న నిరుపేద కుటుంబాలకు చెందిన వారి పిల్లలకు వైద్యం అందిస్తున్నారు. ఈ సమయంలో ఆ శిశువులకు అవసరయ్యే వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక ల్యాబ్ టెక్నీషియన్, ల్యాబ్ అందుబాటులో ఉండగా అత్యవసర సమయంలో తీసేందుకు అధునాతన ఎక్స్‌రే యూనిట్ సైతం ఇక్కడ అందుబాటులో ఉంది.

**రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు**

భద్రాద్రి నవజాత శిశు చికిత్స కేంద్రం రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ సేవలందిస్తున్న కేంద్రంగా గుర్తింపు పొందింది. 2022లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఎంపిక చేయడం జరిగింది. ఇక్కడ శిశువులకు అందిస్తున్న వైద్యం, అధునాతన వైద్య పరికరాలు, చికిత్స పొంది బయటకు వెళ్లిన వారి సంఖ్య , రోగుల నుంచి అందుతున్న మనోగతాల ఆధారంగా ఎస్ఎన్‌సీయును ఎంపిక చేశారు. 2022లో ఈ వైద్య కేంద్రం నేషనల్ నియోనేటాలజీ ఫోరంకు(ఎన్ఎన్ఎఫ్) ఎంపికైంది.

## సాంకేతిక, సాంస్కృతిక మహోత్సవంపై యువత, కళాకారులకు పోటీలు

**భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్**

కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ - ఈశాన్య భారత కలయికలో భాగంగా సాంకేతిక - సాంస్కృతిక మహోత్సవ లోగో, ట్యాగ్‌లైన్, పోస్టర్ డిజైన్‌పై యువత, కళాకారులకు పోటీలు నిర్వహిస్తున్నారని, సకాలంలో తమ ఎంట్రీలు పంపవల్సిందిగా భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. 2025 నవంబర్ 25, 27, డిసెంబర్ 2- 4 తేదీల్లో హైదరాబాద్‌లో రెండు దశలుగా తెలంగాణ, ఈశాన్య భారత రాష్ట్రాల మధ్య సాంకేతిక, సాంస్కృతిక మార్పిడికి వేదికగా నిర్ణయించారని తెలిపారు. దీనికి సంబంధించిన లోగో డిజైన్, ట్యాగ్‌లైన్ రచనలు, పోస్టర్ రూపకల్పనపై పోటీలు నిర్వహిస్తున్నారని, ఆగస్టు 15 లోగా ఎంట్రీలు పంపించాలి కోరారు. ఉత్తమ లోగో డిజైన్‌కు రూ.15వేలు, ఉత్తమ ట్యాగ్‌లైన్‌కు రూ. 5వేలు, ఉత్తమ పోస్టర్ డిజైన్‌కు రూ.20వేలు బహుమతులు ఉంటాయన్నారు. ఈ అవకావాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై విచారణకు ఆదేశాలు..?

(5వ పేజీ తరువాయి)

వివరాలను సేకరించిన ఇంటెలిజెన్స్ అధికారులు ఆ వివరాలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు విశ్వసనీయ సమాచారం.

**ఆది నుంచి విధులపట్ల నిర్లక్ష్యమే..**

సదరు పంచాయతీ కార్యదర్శి ఆది నుంచి విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తాడన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో తాను పనిచేసిన పంచాయతీలలో ఎక్కడ కూడా విధులకు రాకుండా వచ్చినట్లు చూపించుకునే అలవాటు ఉందని సమాచారం. రెండేళ్ల క్రితం తాను పనిచేసిన పంచాయతీలో విధులపట్ల నిర్లక్ష్యంగా ఉండటాన్ని గ్రహించిన నాటి కలెక్టర్ సదరు పంచాయతీ కార్యదర్శిపై ప్రజల ముందే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటనలు ఉన్నాయి. అంతే కాకుండా ప్రస్తుతం గ్రామంలో అధికార పార్టీ వారు చెప్పిన పనులు చేయకుండా ప్రతిపక్ష పార్టీ నాయకులు చెప్పిన పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికార పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేసేందుకు నాయకులు సిద్ధం అయినట్టు విశ్వసనీయ సమాచారం. ఏది ఏమైనా సదరు కార్యదర్శి తన విధులను ఏమాత్రం లెక్కచేయడని, అధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తాడన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సదరు కార్యదర్శి వ్యవహారంపై తోటి కార్యదర్శులే అసహించుకోవడం కొసమెరుపు. ఈ విషయాలపై సదరు కార్యదర్శిని వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

# ఖమ్మంలో.. ‘పాలస్తీనాకు సంఘీభావం’ ర్యాలీ



జడ్పీ సెంటర్‌లో ఆందోళనలో పాల్గొన్న ముస్లిం మహిళలు



ర్యాలీలో పాల్గొన్న పలు పార్టీలు, సంఘాల నాయకులు

(5వ పేజీ తరువాయి)

అంబేద్కర్ సంటర్ వరకు ప్లకార్డులు చేతబట్టి కేంద్ర ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు మద్దతు తెలపడాన్ని నిరసిస్తూ ప్రదర్శన సాగించారు. మైనారిటీ సంస్థలకు చెందిన నాయకులు, మైనారిటీ మహిళలు భారత జాతీయపతాకాలతో పాటు పాలస్తీనా జెండాలు చేతబట్టి సేవ్‌గాజా నినాదాలతో హోరెత్తించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ గాజాలో 20 లక్షల మంది ప్రజలు దుర్భర జీవనం గడుపుతున్నారని, వేలాదిమంది ప్రజలు, పసిపిల్లలు, మహిళలు, వృద్ధులు మరణించారని, అక్కడి ప్రజలకు ఆహారం అందించకుండా ఇజ్రాయెల్ ఆంక్షలు విధించి బాంబులతో రాకెట్ దాడులు చేస్తుండటం గర్హనీయన్నారు. మానవతా సహాయం అందకుండా ఇజ్రాయెల్ సైన్యాలు అడ్డుపడుతున్నాయని, ఆహారం, మందులు అందడంలేదని ఆకలిచావులు, హింసాత్మక సంఘటనలకు ఇజ్రాయెల్ పాల్పడుతోందని మండిపడ్డారు. గాజాకు పేరుకు స్వేచ్ఛ ఇచ్చినట్లు ఇచ్చి భూమి సముద్రం గగనతలంపై లెక్కలేనన్ని ఆంక్షలు విధించి అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నాని మండిపడ్డారు. ఆసుపత్రులు, పాఠశాలలు, నివాసాలపై కూడా బాంబులు వదిలి డాక్టర్లు, పిల్లలను చంపుతున్నారని తక్షణమే యుద్ధాన్ని ఆపివేయాలని, గాజాకు అవసరమైన సహాయం అందించాలంటూ వక్తలు డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు మువ్వా శ్రీనివసరావు, రవిమారుత్, కాంతారావు, వీరారెడ్డి, శేషగిరి, మతిన్, ఐఎంఏ అధ్యక్షులు కంభంపాటి నారాయణరావు, జీవీ జగదీష్, డాక్టర్ గోపీనాథ్, రవీందర్, న్యాయవాదులు జక్కంపుడి నాగేశ్వరరావు, తిరుమలరావు, శేషగిరితో పాటు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఐ నాయకులు అజీజ్‌పాషా, దండిసరేష్ , సీపీఎం నాయకులు నున్నా నాగేశ్వరరావు, విక్రం, కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగరాజు, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఖమర్, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, జమాతె ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు జైనుల్‌పాషా, మహ్మద్ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనారిటీ మహిళలు గాజాలో జరుగుతున్న హింసాత్మక దాడులను కళ్లకుకట్టినట్టు చూపేలా.. చిన్న పిల్లల ఆకారంతో తయారుచేసిన బొమ్మలు, గాయాలతో ఉన్నట్టుగా చూపిస్తూ చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.

## బౌద్ధ స్తూపానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలి

» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



బౌద్ధస్తూపం అభివృద్ధిపై బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేకాధికారి లక్ష్మయ్యతో చర్చిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నేలకొండపల్లి, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దదైన నేలకొండపల్లి బౌద్ధస్తూపానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. నేలకొండపల్లి బౌద్ధస్తూపాన్ని, నాగార్జునసాగర్ బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్యతో కలిసి గురువారం కలెక్టర్ సందర్శించారు. వారు బౌద్ధస్తూపం ప్రాంతం మొత్తాన్ని కలియ తిరిగారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బౌద్ధస్తూపం అభివృద్ధికి రూ.2.5కోట్లు మంజూరయ్యాయన్నారు. బౌద్ధ స్తూపంలో బుద్దిస్టు, పిల్లల పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బౌద్ధస్తూపలం పక్కనే ఉన్న బాల సముద్రం చెరువులో పర్యాటకుల సౌకర్యార్థం బోటు షికారును ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. బౌద్ధస్థూపంలో లైటింగ్, బుద్ధుని విగ్రహాలతో మ్యూజియం, మెడిటేషన్ హాల్‌ను నిర్మించనున్నట్లు చెప్పారు. నాగార్జునసాగర్ మ్యూజియంలో ఉన్న బౌద్ధ విగ్రహాలతో పాటుగా అరుదైన బౌద్ధ విగ్రహాలతో బుద్ధుని జీవిత చరిత్ర తెలిపేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. బౌద్ధస్తూపం ప్రవేశ ద్వారం వద్ద ఆకర్షణీయంగా, పెద్ద బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నాగార్జునసాగర్‌లోని బుద్దవనానికి ధీటుగా నేలకొండపల్లి బౌద్ద స్థూపాన్ని అభివృద్ధి చేయటానికి అన్ని చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేలకొండపల్లి బౌద్ధస్తూపాన్ని పూర్తిస్థాయిలో, అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలన్న ఆసక్తితో ఉన్నారని బుద్దవనం ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య అన్నారు. అభివృద్ధికి మంజూరైన 2.5కోట్లు సరిపోకపోతే మరిన్ని నిధులు తెచ్చి అభివృద్ధి పరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, పర్యాటక శాఖ డీఈ రామకృష్ణ, జిల్లా పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి, ఎస్ఎస్ఎస్ అసోసియేట్ చీఫ్ కన్సల్టెంట్ వెంకటేష్, ఎమ్మార్వై ఆలస్యం మధుసూధన్‌రావు, సర్వేయర్ మధుమోహన్, ఎంపీవో శివ తదితరులు పాల్గొన్నారు.

### ఆగస్టు 15 నాటికి రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారం

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15 నాటికి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి 75వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిలో సాదా బైనామాకు సంబంధించి ఉన్న 49వేల దరఖాస్తులకు వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. సాదా బైనామా మినహాయించి పెం డింగ్ ఉన్న దరఖాస్తులను మండలాల వారీగా ప్రస్తుత స్థితిగతులపై నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి దరఖాస్తు సంబంధించి నోటీసుల జారీ పూర్తి చేయాలని, రోజూ మండల స్థాయిలో దరఖాస్తుల పరిష్కారం పూర్తి చేయాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 15 నాటికి దరఖాస్తుల పరిష్కరించాలని అన్నా రు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను తిరస్కరించే నేపథ్యంలో దానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని తెలిపారు. ప్రతి మండలంలో 10శాతం దరఖాస్తులను జిల్లా స్థాయిలో ర్యాండమ్‌గా చెక్ చేయడం జరుగుతుందని, భూ భారతి చట్టం నిబంధనలు పాటించని పక్షంలో చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను తిరస్కరించే నేపథ్యంలో దానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, జిల్లాలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# పండుగల.. కళ

» నేడు వరలక్ష్మీ వ్రతం » రేపు రక్షా బంధన్

» రెండు పండుగలతో పట్టణాలు, పల్లెల్లో సందడి
» ప్రత్యేక పూజలకు ముస్తాబైన ఆలయాలు
» పూజాసామగ్రి, రాఖీల కొనుగోళ్లతో మార్కెట్లలో జనం రద్దీ

ఖమ్మం ఖానాపురంహవేలి/కొత్తగూడెం సాంస్కృతికం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం అంటేనే పవిత్రమైన.. ప్రీతికరమైన మాసం. ఈ మాసంలో అధికంగా మహిళలు శ్రావణ శుక్రవారాల పూజలు, రాఖీ పండుగ సందడితో జిల్లా వ్యాప్తంగా ప్రతీ ఇల్లు సందడిగా ఉంటుంది. మార్కెట్‌లో మహిళలు అధికంగా పండుగ వస్తువులు కొనుగోళ్లు చేస్తుండటంతో మార్కెంట్‌లో పండుగ వాతావరణం నెలకొంది. శ్రావణ వరలక్ష్మి వ్రతాలు, నోములు, రాఖీ పండుగకు ఆడబిడ్డలతో ప్రతి ఇల్లు పండుగ వాతావరణంలో కనిపిస్తుంది. జిల్లా వ్యాప్తంగా ఆలయాలలో శ్రావణ వరలక్ష్మీ వ్రతాల పూజలకు ఏర్పాట్లు చేశారు. మహిళలు రాఖీల కొనుగోళ్లతో బిజీబిజీగా ఉంటారు. శ్రావణమాసంలో రెండో శుక్రవారం ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. కాని ఈ ఏడాది ఐదు శుక్రవారాలు రావటంతో పౌర్ణమికి ముందు శుక్రవారం వరలక్ష్మీ వ్రతం చేయడం సంప్రదాయం కావడంతో ఈ ఏడాది మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నారు. నగరంలోని ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. మాములు ధరల కంటే మూడు రేట్లు అధికంగా ధరలు పలుకుతుండటంతో వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమైంది.

కొత్తగూడెంలో మూర మల్లెపూల దండ రూ. 60లు పలకడం ఆశ్చర్యాన్ని కలిగించింది. చామంతి సాధారణ రోజుల్లో కేజీ రూ.200 ఉండగా ప్రస్తుతం కేజీ రూ. 600 పలకడం విశేషం. లక్ష్మీదేవికి అలంకరణ చేయడం విశిష్టతను సంతరించుకోవడంతో పూలను కొనుగోలు చేయడంతో తప్పని సరిగా మారింది.



కొత్తగూడెంలో మిఠాయిలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

### పూలు, పండ్ల ధరలకు రెక్కలు

శుక్రవారం వరలక్ష్మి వ్రతం పురస్కరించుకొని పూలు, పండ్ల ధరలకు రెక్కలొచ్చాయి. కిలో చామంతి పూలు. రూ. 500, బంతి పూలు రూ. 300, మల్లెపూలు రూ. 800, గులాబీ ఒక్కొక్కటి రూ.10 చొప్పున విక్రయించారు. డజన్ అరటిపండ్లు రూ. 80, కిలో ఆపిల్ పండ్లు రూ.250 ధర పలుకుతున్నాయి. వీటితో పాటు ఆకులు, వక్కల ధరలు ఆకాశాన్ని అంటాయి.



ఖమ్మంలో పూలను కొనుగోలు చేస్తున్న మహిళలు

### రాఖీల కొనుగోళ్ల సందడి

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకునిఖమ్మం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రాఖీల కొనుగోలు కేంద్రాలు కళకళలాడుతున్నాయి. వివిధ రకాల రాఖీలు అందుబాటులోకి ఉంచడంతో వాటిని మహిళలు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. బేన్‌టెన్, చోటాభీమ్, ఫేస్‌బుక్ లోగో వంటి వెరైటీ రాఖీలను అందుబాటులో ఉంచారు. అయితే.. శనివారం పండుగ ఉండటంతో యువతులు, మహిళలు, చిన్నారులు వీటిని కొనుగోలు చేస్తుండటంతో ఆ ప్రాంతాలు సందడిగా మారాయి.



రాఖీల కొనుగోలులో నిమగ్నమైన మహిళలు..

## తల్లడిల్లిన తోబుట్టువు..

» డెంగ్యూతో తమ్ముడి మృతి..
» చివరి రాఖీ కట్టిన అక్క
» కిష్టాపురంలో కన్నీరు పెట్టించిన ఘటన



చితి వద్ద తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క జ్యోతి

కూసుమంచి, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): తమ చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. తండ్రి పెంపకంలో ఇద్దరూ కలిసి పెరిగారు. తమ్ముడంటే ఆ అక్కకు ఎంతో ప్రేమ. ప్రతీ ఏడాది రాఖీ పండుగ రోజున తప్పకుండా సోదరుడికి రాఖీ కట్టి తన ప్రేమను చాటుకుంటుంది. కానీ ఈ సారి ఆ తోబుట్టువుకు కన్నీరే మిగిలింది. డెంగ్యూ జ్వరంతో మృతిచెందిన తమ్ముడికి చివరి రాఖీ కట్టి తల్లడిల్లిపోయింది. ఈ దృశ్యాన్ని చూసిన వారంతా గుం డెలవిసేలా రోదించారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కిష్టాపురం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన అవివాహితుడైన పందిరి అప్పిరెడ్డి(24) డెంగ్యూ జ్వరం బారిన పడి చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. గురువారం బంధువులు, గ్రామస్థులు అతడి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో సోదరి సంకపల్లి జ్యోతి తన సోదరుని మృతదేహాన్ని పట్టుకుని.. 'తమ్ముడూ.. చిన్న నాటి నుంచి తల్లి లేకుండానే పెరిగాం. నీవుకూడా నన్ను వదిలి వెళ్లిపోయావు.. రాఖీ పండక్కి నన్ను రమ్మన్నావు.. ఇప్పుడు నువ్వే లేకుండా పోయావు..' అంటూ ఆమె రోదించిన తీరు అందరి హృదయాల్ని కలచివేసింది. 'ఇదే తమ్ముడు నీకు నేను కట్టే చివరి రాఖీ' అంటూ నిర్జీవంగా చితిపై ఉన్న తమ్ముడి మృతదేహానికి జ్యోతి రాఖీ కట్టింది. అలాగే అప్పిరెడ్డికి సోదరి వరసయ్యే వారంతా రాఖీలు కట్టారు. అప్పిరెడ్డికి తండ్రి వృద్ధుడు కాగా.. కుమారుడి చేత తలకొరివి పెట్టించుకోవాల్సిన ఆయన.. కొడుకుకే తలకొరివి పెట్టడం గ్రామస్థులను కలిచివేసింది.

## జల్ జీవన్ మిషన్ స్కీంను పర్యవేక్షించాలి

» అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ సోన్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జల్ జీవన్ మిషన్ పథకం కింద మౌలిక వసతుల కల్పన పనుల పురోగతి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కేంద్ర జల్ జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ సోన్ అన్నారు. జల్ జీవన్ మిషన్‌పై తెలంగాణ, ఝార్ఖండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర జల్‌జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ సోన్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ పథకాలను పర్యవేక్షించేందుకు డాష్ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని, దీనికి సంబంధించిన లాగిన్ వివరాలను జిల్లా కలెక్టర్లు తీసుకుని వారి పరిధిలోని పనులను పకడ్బందీగా పర్యవేక్షించాలని అన్నారు. దిశ సమావేశాలు రెగ్యులర్‌గా నిర్వహించి జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ పై సమీక్షలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశాల మినెట్స్ కాపీలను ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని అన్నారు. తాగునీటి సరఫరా అవకాశాలను బలోపేతం చేయాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కలెక్టర్, జడ్పీ సీఈవో, ఈఈ మిషన్ భగీరథ లాగిన్ క్రియేట్ చేసినట్లు తెలిపారు. గతి శక్తి కింద 2,571 కి.మీ. పనులు పూర్తి చేశామని అన్నారు. దిశ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ శేఖర్ రెడ్డి, ఈఈ పుష్పలత, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

ఖమ్మం మార్కెట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా మూడు రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల కోరిక మేరకు ఈనెల 8న శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక సెలవు 9,10 శని, ఆదివారాలు వారాంతపు సెలవుల సందర్భంగా వరుసగా సెలవు ఉన్నట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌లో తిరిగి ఈనెల 11న సోమవారం యథావిధిగా క్రయ, విక్రయాలు ఉంటాయని తెలిపారు. రైతులు సెలవుల విషయాన్ని గ్రహించాలని కోరారు.

## విద్యార్థినిని వేధించిన ఏకలవ్య టీచర్.. విధుల నుంచి తొలగింపు

దుమ్ముగూడెం ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగరం ఏకలవ్యలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఎల్. నాగేశ్వరావును విధుల నుంచి తొలగిస్తూ తెలంగాణ గిరిజన గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఆరోతరగతి విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించిన విషయమై వెలుగులోకి రాగా, ఈనెల 6న ఆర్‌సీఓ అరుణకుమారి విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. విద్యార్థినిను అసభ్యకరంగా తాకడం నిజమేనని అధికారుల విచారణలో తేలడంతో చర్యలు చేపట్టారు.తొలగింపును ఆర్‌సీఓ అరుణకుమారి ధృవీకరించారు.

## జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

తిరుమలాయపాలెం, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని గోపాలపు రానికి చెందిన కొప్పుల ప్రవీణ్ (25) అవివాహితుడు. జీవితంపై విరక్తితో బుధవారం ఇంటివద్దే ఎవరులేని సమయం లో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించాడు. గమనిం చిన చుట్టు పక్కల వారు కుటుంబ సభ్యుల కు తెలిపారు. ప్రవీణ్‌ను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

# చేతబడి నెపంతో గొత్తికోయ వ్యక్తి హత్య

» బాలికను చంపేశాడంటూ కర్రలతో కొట్టి చంపిన గ్రామస్థులు » ఆళ్లపల్లి మండలం బూసురాయిలో సంఘటన



మృతదేహాన్ని కాలినడకన పోస్టుమార్టానికి తరలిస్తున్న దృశ్యం



ఆళ్లపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేతబడి చేసి తమ గ్రామానికి చెందిన ఓ బాలికను చంపేశాడన్న అనుమానంతో గ్రామస్థులు ఓ గొత్తికోయ వ్యక్తిని కర్రలతో కొట్టి హతమార్చిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం పెద్దవెంకటాపూరం పంచాయతీ బూసురాయి గ్రామంలో బుధవారం జరిగింది. గురువారం వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలివీ.. బూసురాయి గ్రామానికి చెందిన పోడియం నందు కూతురు పొడియం గంగి(9)అనే బాలిక కామెర్ల బారిన పడి బుధవారం మృతి చెందింది. కాగా ఆ బాలిక మృతికి అదే గ్రామానికి చెందిన మడకం బీడ అలియాస్ రాజు(35)అనే వ్యక్తి చేతబడి చేయడమే కారణమని కొందరు గొత్తికోయ గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో రాజును బాలిక మృతదేహం వద్దకు తీసుకొచ్చి తాళ్లతో కట్టేసి కర్రలతో కొట్టి చంపేశారు. అనంతరం మృతదేహన్ని రాజు ఇంటిముందు పడేశారు. గురువారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు బూసురాయికి చేరుకుని జరిగిన సంఘటనపై దర్యాప్తు చేపట్టారు. రాజు కుటుంబ సభ్యురాలు ఎట్టి నందిని పిర్యాదు మేరకు గ్రామానికి చెందిన మడవిరాజు, మొక్కటి చిన్నసోమయ్య, మొక్కటి భీమయ్య, వజ్జ గంగ, వేకో జోగా, మొక్కటి వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేయగా.. వారంతా పరారీలో ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడు రాజుకు లక్ష్మీ, పొజ్జి, సన్ని ముగ్గురు భార్యలున్నారు.

### పది కిలోమీటర్లు గుట్టలబాటలో పోస్టుమార్టానికి తరలింపు

రాజు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లెందుకు తరలించేందుకు పోలీసులు, గ్రామస్థులు తంటాలు పడ్డారు. బూసురాయి నుంచి సింగారం వరకు సుమారు 10కిలోమీటర్లు శవాన్ని కాలినడకన, గుట్టలబాటలో తీసుకొచ్చారు. అక్కడి నుంచి బులేరాలో ఇల్లెందుకు తరలించారు.

## రూ.3.53లక్షల సొత్తు చోరీ

దుమ్ముగూడెం ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రామచంద్రునిపేటలో ఈనెల 6న జరిగిన చోరీపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. సోయం రామిశెట్టి ఇంట్లో దొంగలు పడి రూ.3.53లక్షల విలువ గల పద మూడు తులాల బంగారం, రూ.18వేల నగదును అపహరించారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఇంట్లో కుటుంబ సభ్యులెవరూ లేని సమయం చూసి తలుపు తాళాలను తొలగించి ఇంట్లోకి ప్రవేశించారు. మూడు ఇనుప బీరువాలను పగలగొట్టి చోరీకు పాల్పడ్డారు. రామిశెట్టి అశ్వాపురం జూనియర్ కళాశాలలో జూనియర్ అసిస్టెంటుగానూ, అతని భార్య బుజ్జమ్మ స్థానిక అంగన్‌వాడీలో వర్కరుగా విధులు నిర్వర్తిస్తునారు. బుచ్చమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## చేపల వేటకు వెళ్లి గిరిజన యువకుడి మృతి

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి గిరిజన యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో గురువారం జరిగింది. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కేసప్ప గూడెం గ్రామానికి చెందిన సోడెం మహేశ్(29) తమ్ముడు ముత్యాలరావుతో పాటు మరికొంత మందితో కలిసి ఊట్లపల్లి సమీపంలోని వెంకమ్మ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈక్రమంలోనే మహేశ్ చెరువులో తన వద్ద ఉన్న వలను నీళ్లలో వేసేందుకు వెళ్లాడు. చెరువులోకి దిగి కొద్దిదూరం వెళ్లాక వలను విసిరే క్రమంలో అదుపుతప్పి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు.

ఈత రాకపోవటంతో నీటిలో మునుగుతూ కేకలు వేయగా సమీపంలో ఉన్న తమ్ముడు ముత్యాలరావు, గ్రామస్తులు మహేశ్‌ను కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుడు అవివాహితుడు. మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తమ్ముడు ముత్యాలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యయాతిరాజు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఎన్నెస్పీ వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్మరణం

మృతుడి స్వస్థలం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు



బస్సు కిందకు దూసుకెళ్లిన బైక్, హుస్సేన్ (ఫైల్)

కూసుమంచి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయం వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్‌ను ఆర్టీసీ బస్ ఢీకొట్టింది. ఈప్రమాదంలో సాగర్ ఎడమకాలువ అవుట్ పాల్స్‌పై వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలుకు చెందిన బండ్ల హుస్సేన్(58) అక్కడిక్కడే మృతిచెందాడు. ఎన్ఎస్పీ కెనాల్ డ్యూటీకి వచ్చి బైక్‌పై పాలేరు వైపు వెళుతుండగా బ్రిడ్జిమీదకు రాగానే తనకు వెనుకవైపునుంచి మధిర డిపోకు చెందిన బస్సు డ్రైవర్ బస్సును అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి వెనుకవైపునుంచి ఢీకొట్టాడు. దీంతో హుస్సేన్‌కు బలమైన గాయాలు తగలడంతో అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. హుస్సేన్ సుమారు 2021నుంచి సాగర్‌కాల్వపై వర్క్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈమేరకు మృతుడి కుమారుడు బండ్ల అనిల్ నాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసున మోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హుస్సేన్ మృతిపట్ల నీటిపారుదల శాఖ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

## సారా విక్రేత అరెస్టు.. కేసు నమోదు



ఎస్ఐ కిషోర్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ అష్రఫ్ ఆలీ, కానిస్టేబుల్ శ్రీను, ప్రసన్న కుమార్‌లు

పినపాక, 7 ఆగష్టు (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగినేపల్లిలో గురువారం మణుగూరు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. వాహన తనిఖీల్లో దుగినేపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై లనుమానస్పదంగా రావడంతో, గమనించి వాహనాన్ని ఆపి తనిఖీలు చేయగా, అతని వద్ద 6 లీటర్ల నాటుసారా పట్టుబడిందన్నారు. విచారించగా దుగినేపల్లి గ్రామానికి చెందిన బోడ సురేష్ గా తేలిందన్నారు. అతని వద్ద సారా, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. తనిఖీలలో పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న ఐదుగురిపై కేసు

దమ్మపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న 5గురు వ్యక్తులపై దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేయగా మరో వ్యక్తి పరార్ అయ్యాడు. ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గండుగులపల్లి బైపాస్ రోడ్ శివారులోని తోటలో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు గురువారం ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి సిబ్బందితో దాడి చేసారు. ఈదాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా మరొక వ్యక్తి పరార్ అయ్యాడు. వారి వద్ద నుండి రూ2800 నగదు ,రెండు ద్విచక్రవాహనాలు స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# అయోధ్యకు కన్నీటి వీడ్కోలు

» నివాళులర్పించిన కూనంనేని, చాడా వెంకటరెడ్డి, ఎమ్మెల్యే తెల్లం, మాజీ ఎమ్మెల్యే రేగా



నివాళులర్పిస్తున్న సీపీఐ జాతీయ నాయకుడు చాడా వెంకటరెడ్డి

మణుగూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీపీఐ రాష్ట్ర నేత బీ అ యోధ్యకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన అంత్యక్రియలను గురువారం స్వగ్రామం రామానుజవరంలో పూర్తిచేయగా.. పలువురు నాయకులు మృతదేహం వద్ద నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, టీడీపీ నాయకులు వట్టం నారాయణ, మాస్‌లైన్ నాయకులు మధుసూధన్ రెడ్డి, తదితరులు నివాళులర్పించారు. సంతాప సభలో నాయకులు అయోధ్య ప్రజలకు చేసిన సేవలను వివరించారు. సీపీఐకి తీరని లోటని పేర్కొన్నారు. ప్రజల మనిషిగా నాయకుడిగా అయోధ్య నిలిచారని నాయకులు అంతా సంతాపం ప్రకటించారు. సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం రాంచందర్, బీటీపీఎస్ సీఈ బిచ్చన్న పలు పార్టీల నాయకులు, న్యాయవాదులు, అన్ని వర్గాల ప్రజలు అయోధ్య అంతిమ యాత్రలో పాల్గొన్నారు.





## ఎన్నికల హామీలను నెరవేర్చాలి

తిరుమలాయపాలెం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ఎన్నికలసమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పిండిప్రోలులో రాయల వెంకటనారాయణ స్మారకభవనంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడు తూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం రైతుభరోసా పెంచుతామని చెప్పి పెంచలేదన్నారు. అలాగే మహలక్ష్మి కింద రూ.2500లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం వారిని మోసం చేసిందన్నారు. అర్హులైన వారికి సంక్షేమపథకాలు అందించాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు పి.వెంకటస్వామి, మీగడ సత్యం, యడ్లపల్లి నవీన్, ఆరెంపుల వెంకన్న, చిరంజీవి, మధు, పాల్గొన్నారు.

### జిల్లాను పర్యాటకంలో
## ఉన్నతంగా తీర్చిదిద్దాలి



ఖిల్లాను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాను పర్యాటకంలో ఉన్నతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం నగరంలోని ఖిల్లా, జాఫర్ బావిలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం ఖిల్లా మంచి పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని, ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రూ.29 కోట్లతో చేపడుతున్న ఖమ్మం ఖిల్లా రోప్‌వే నిర్మాణానికి చర్యలు వేగవంతం చేయాలన్నారు. రూ.15 కోట్లు ఖమ్మం నగరపాలక సంస్థ నుంచి, రూ.14 కోట్లు టీజీయూఐడీసీ అందిస్తుందన్నారు. రోప్‌వే నిర్మాణానికి స్థల సేకరణ పూర్తి చేసినట్లు, వారం రోజులలో పనులు ప్రారంభించాలని అన్నారు. కలకత్తాకు చెందిన కన్వేయర్ అండ్ రోప్‌వే సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణ పనులు చేయనున్నట్లు తెలిపారు. జాఫర్ బావి, ఖిల్లా అభివృద్ధితో ఖమ్మం పర్యాటక ప్రాంతంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నరసింహారావు, పర్యాటక అభివృద్ధి అధికారి సుమన్ చక్రవర్తి, అర్బన్ తహసీల్దార్ సైదులు, పర్యాటక శాఖ డీఈ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నానో యూరియాతో అధిక దిగుబడులు



నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏవో వాణి

కూసుమంచి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నానో యూరియాతో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందని కూసుమంచి వ్యవసాయశాఖ అధికారి వాణి తెలిపారు. నానో యూరియాపై పోచారం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీ వాడటం వల్ల అనేక లాభాలున్నాయన్నారు. ద్రవరూపంలో ఉన్న ఎరువులను పురుగుమందుల్లో కలిపి పిచికారీ చేసుకోవడం వల్ల శ్రమ ఖర్చు తగ్గుతుందన్నారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయక్షేత్రాలు తిరుగుతూ నానోయూరియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో యూత్‌ఫెస్టివల్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు రెడ్ రిబ్బన్ క్లబ్, ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్ యూత్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతీబాయి తెలిపారు. ఈనెల 11న విద్యార్థులకు పరుగు పందాన్ని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ప్రతి కళాశాల నుంచి ఇద్దరు చొప్పున పాల్గొనాలని కోరారు. పోటీలలో ప్రథమ స్థానం గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులను రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు యస్. రామకృష్ణ, 7989999788, టి. వీరయ్య 9177103193 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## పారా అథ్లెటిక్స్ పోటీల్లో
## 'నిర్మల్ హృదయ్' విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ సాంబశివారెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థిని అస్మారూహి ప్రతిభ చూపి రెండు పతకాలు సాధించిందని పాఠశాల కరస్పాండెంట్ వంగా సాంబశివారెడ్డి తెలిపారు. 100 మిటర్ల పరుగు పోటీలో రజత పతకంతో పాటు లాంగ్‌జంప్‌లో కాంస్య పతకాలు సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీలలో పతకాలు సాధించిన విద్యార్థినిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పద్మజ ఉన్నారు.

## హరితహారం పనులు
## త్వరగా పూర్తి చేయాలి: ఏపీడీ

నేలకొండపల్లి, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): హరితహారానికి సంబంధించిన పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని డీఆర్డీఏ ఏపీడీ శ్రీదేవి ఆదేశించారు. నేలకొండపల్లి కట్టలమ్మ చెరువు సమీపంలో మొక్కలు నాటటానికి ఉ పాధి కూలీలు తీస్తున్న గుంతల ను ఏపీడీ శ్రీదేవి ఎంపీడీవో మర్రి ఎర్రయ్యతో కలిసి పరిశీలించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం గుంతలను తీయాలన్నారు. గుంతలు తీసే పనిని వేగంగా పూర్తి చేయాలని, వెంటనే మొక్కలను నాటాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## బార్ అసోసియేషన్ హాల్లో పాము కలకలం



ఖమ్మం లీగల్ ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : గురువారం బార్ అసోసియేషన్ హాల్లో పాము కలకలం సృష్టించింది. న్యాయవాదులు అందరూ ఉండే బార్ అసోసియేషన్ హాల్లో ఒక్కసారిగా పాము ప్రత్యక్షమయ్యేసరికి అక్కడ చదరంగం, క్యారమ్స్ ఆడుతున్న న్యాయవాదులు ఆందోళనకు గురయ్యారు. అందరూ కలిసి అతికష్టం మీద దాన్ని బయటకు పంపివేశారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బార్ అసోసియేషన్ హాల్లో సాయంత్రం 4 గంటల సమయంలో నిర్వహిస్తున్న చెస్, క్యారమ్స్ పోటీలు జరుగుతుండటంతో కొద్ది మంది మాత్రమే న్యాయవాదులు ఉన్నారు. ఆ సమయంలో వచ్చినటువంటి పామును బయటకు వెళ్లగొట్టటంతో ఊపిరి పీల్చుకున్నారు.

### సమస్యల వలయంలో
# గొల్లగూడెం ఉన్నత పాఠశాల

- మందుబాబులకు అడ్డాగా పాఠశాల ఆవరణ
- అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ పిల్లలు ప్రైవేటు బడిలో చదువుతున్న వైనం
- తాగునీరు, మూత్రశాలలు లేక విద్యార్థుల ఇబ్బందులు
- నెల రోజులుగా పాఠశాలకు రాని గణిత ఉపాధ్యాయుడు



పాఠశాలలో తల లేకుండా ఉన్న గాంధీ విగ్రహం

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో ఉన్నత స్థితిలో ఉంచాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల అమానుషంగా ప్రవర్తించడం తోపాటు ఏదైనా సమస్యను ఉపాధ్యాయులకు చెబితే సమస్యను తీర్చకపోగా విద్యార్థులపై అసభ్యపదజాలంతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు. పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లులలో ఒకరిని పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్‌గా ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కాని ఆ పాఠశాలలో ప్రస్తుతం ఉన్న చైర్‌పర్సన్ పిల్లలు ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. అయినా ఆమె ఆ పాఠశాలకు చైర్‌పర్సన్‌గా ఉంటూ కేవలం నిధుల విడుదలకు సంబంధించిన ఫైల్స్‌పైన సంతకాలు చేయడం తప్ప, పాఠశాలకు సంబంధించిన సమస్యలను పట్టించుకోదంటూ స్థానికులు వాపోతున్నారు. గత నెల రోజులుగా గణిత ఉపాధ్యాయుడు పాఠశాలకు రావడంలేదని విద్యార్థులు వాపోతున్నారు. ఇది ఖమ్మం నగరానికి కూతవేటులో ఉన్న గొల్లగూడెం జడ్పీహెచ్ఎస్ పాఠశాల పరిస్థితి. ఈ విషయాలు విద్యాశాఖ అధికారులు తెలిసినప్పటికీ ఆ పాఠశాల ఉపాధ్యాయులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. యావత్ బారతదేశంతోపాటు ఇతర దేశాలు ఎంతో గొప్పగా ఆరాధించే వ్యక్తి గాంధీని ఈ పాఠశాలలో అగౌరవపరుస్తూ గాంధీ విగ్రహానికి తల లేకుండా ఉంచారు. కనీసం ఆ విగ్రహాన్ని గుడ్డతో కప్పిఉంచకుండా తలలేని విగ్రహాన్ని అలానే ఉంచటం ఎంత వరకు సమంజసమే ఆ పాఠశాల ఉపాధ్యాయులకే తెలియాలి. గాంధీ జయంతి, వర్థంతుల రోజు గాంధీ చిత్రపటాలకు పూల దండలు వేసే నాయకులకు ఈ తలలేని విగ్రహం కనబడటంలేదా పలువురు గాంధేయవాదులు ప్రశ్నిస్తున్నారు.



తలుపులు లేని బాలికల మూత్రశాల



పాఠశాలలో మద్యం బాటిళ్లు

గొల్లగూడెం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 6నుంచి 10 వ తరగతి వరకు మొత్తం 74 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో బాలికలు39 మంది, బాలురు 35 ఉన్నారు. ఒక ప్రధానోపాధాయురాలు తోపాటు మరో 7గురు ఉపాధ్యాయులు ఉన్నారు. 74 మంది విద్యార్థులకు 8 మంది ఉపాధ్యాయుల ఉన్నా చదువులో ఎప్పుడు వెనుకబడే ఉంటుంది. కాగా పాఠశాలలో బాలికలకు, బాలురకు ఒకే మూత్రశాల ఉంది. ఉపాధ్యాయులకు మరో మూత్రశాల ఉంది. కానీ ఆ మూత్రశాలకు డోర్ లేకపోవడంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులు వాడే బాత్రూం వాడుదామంటే ఆ బాత్రూంకు తాళ్లం వేసిఉంచుతారని, మూత్రశాలలకు నీరు కూడా విద్యార్థులే పెట్టాల్సిన పరిస్థితి ఉందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. గణిత పాఠాలు చెప్పేందుకు మరో ఉపాధ్యాయుడు లేకపోవటంతో విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం పడుతుందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. మధ్యాహ్న భోజనం కూడా నాణ్యంగా లేదని ఆ భోజనం తినే పరిస్థితి లేదని వాపోతున్నారు. దీంతో పాటు పాఠశాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారిందని, పాఠశాలలోని వాటర్ ట్యాంక్ కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేదని వాపోతున్నారు. విద్యార్థులకు తాగేందుకు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఏదైనా సమస్యను ఉపాధ్యాయులకు చెబితే ఆ రోజు ఆ విద్యార్థిని కొట్టడం, తిట్టడం వంటి చర్యలకు పాల్పడుతారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయమై సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీలను వివరణ కోరగా గణిత ఉపాధ్యాయుడు గత నెల రోజులుగా రావడంలేదని మెడికల్ లీవ్ పెట్టారని, దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులకు గణిత పాఠాలు చెప్పడం లేదని గురువారం పాఠశాలకు వచ్చి విద్యార్థులతో కలిసి నిరసన తెలిపిన మాట వాస్తవమే అని అన్నారు. గణిత ఉపాధ్యాయుడు లేని విషయాన్ని ఎంఈవోకు, డీఈవో కార్యాలయానికి సమాచారం అందించానని, కాని గణిత ఉపాధ్యాయుడిని మాకు పంపలేదని అన్నారు.

**సమస్యలు పరిష్కరించాలి**

**● వెంకటేశ్వర్లు, విద్యార్థుల తండ్రి**

నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారు ఆదే పాఠశాలలో 7, 8, 10 తరగతులు చదువుతున్నారు. గత ఏడాది నుంచి పాఠశాల సమస్యలను పట్టించుకునే వారే లేకపోవడంతో నేను మా పిల్లలను వైఎస్ఆర్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు పంపించాను. ఈ ఏడాది పాఠశాలలో మంచిగా చదువు చెబుతారని ఉపాధ్యాయులు నమ్మించడంతో నా పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించాను. కానీ గత ఏడాది కంటే దారుణంగా ఉంది పరిస్థితి. అధికారులు స్పందించకుంటే పాఠశాల మూతపడేందుకు అవకాశాలు ఉన్నాయి.

## నిధులు మంజూరు చేయాలని వినతి

- సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవిని కలిసిన మేయర్ బృందం
- కేఎంసీకి రావాల్సిన నిధులపై లేఖ అందజేత



సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవికి వినతిపత్రం అందిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిబంధనల మేరకు ఖమ్మం నగర పాలక సంస్థకు రావాల్సిన నిధులను తక్షణమే విడుదల చేయించాలని, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ కోరారు. గురువారం హైదరాబాద్‌లో సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవిని మేయర్‌తో పాటుగా డిప్యూటీ మేయర్ పాతిమాజోహారా, కార్పొరేటర్లు కలిశారు. ఖమ్మం నగరానికి రావాల్సిన నిధులపై లేఖను అం దించారు. రెవెన్యూ కలెక్షన్, ఎల్ఆర్ఎస్ వసూళ్లలో రూ.60 కోట్లు రావాల్సి ఉందన్నారు. అండర్ డ్రైయినేజీకి రూ.1,200 కోట్లు, 24గంటల తాగునీటి సరఫరాకు రూ.155 కోట్లు, వరదనీటి కాల్వకు నిర్మాణానికి రూ.250 కోట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.150 కోట్లు ఇవ్వాలని కోరారు. ఖమ్మం నగరం లో గణనీయంగా ఆదాయ సేకరణ జరిగిందని ఆ మేరకు కేఎంసీకి రావాల్సిన నిధులను వెంటనే ఇవ్వాలని కోరారు. దీంతో స్పందించిన సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవి మాట్లాడుతూ నిబంధనల మేరకు నిధుల మంజూరుకు సహకరిస్తామన్నా రు. కార్పొరేటర్లు రాపర్తి శరత్‌కుమార్, కన్నం వైష్ణవి, గజ్జల లక్ష్మి, ఆళ్ల నరీష, మడూరి ప్రసాద్, సరిపూడి రమాదేవి, చిరుమామిళ్ల లక్ష్మి, పాకాలపాటి విజయనిర్మల, చామకూరి వెంకన్న, కొత్తపల్లి నీరజ, మందడపు లక్ష్మి, నాయకులు కన్నం ప్రసన్న, ముక్తార్, సరిపూడి సతీష్, సైదారావు పాల్గొన్నారు.

## బలమైన డీఆర్ఎఫ్‌తో విపత్తులను ఎదుర్కొనే సత్తా

- కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అనిల్




ధృవపత్రాలు పంపిణీ చేస్తున్న అనిల్

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం రాష్ట్రంలోనే అభివృద్ధిలో ఎంతో ముందజంలో ఉందని, ఇప్పుడు బలమైన డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులోకి రావడంతో ఎటువంటి విపత్తులు వచ్చినా వాటిని స్వయంగా తట్టుకునే సామర్థ్యం ఏర్పడిందని కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అనిల్, డీఆర్ఎఫ్ ఇన్‌చార్జి బెల్లం రాధిక పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన నోబెల్ లైఫ్ సేవింగ్ సొసైటీ ఆధ్వర్యంలో 12 రోజులు పాటుగా కొనసాగిన డీఆర్ఎఫ్ వృత్తిపరమైన శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా లకారం ట్యాంకు బండ్‌లో ప్రత్యేక ప్రదర్శనలు చేశారు. అత్యవసర సమయంలో బోటింగ్ నిర్వాహణ, నీటిలో నుంచి బాధితులను బయటకు తీసి వారిని అంబులెన్స్‌లోకి ఎక్కించడం, ప్రథమ చికిత్సపై ప్రదర్శనలు చేశారు. అనంతరం నిర్వహించిన సభలో శిక్షణ పొందిన 22 మంది డీఆర్ఎఫ్ సిబ్బందికి ధృవపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రజలు ప్రాణాలను కాపాడటమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఆర్వో పాషా, శానిటరి ఇన్‌స్పెక్టర్ శంకర్, లకారం మెనేజరు విజయ్ పాల్గొన్నారు.

## చేగొమ్మ సొసైటీ చైర్మన్‌గా
## శ్రీనివాసరావుకు బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

కూసుమంచి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేగొమ్మ సొసైటీ చైర్మన్‌గా బడేటి శ్రీనివాసరావు తిరిగి బాధ్యతలు స్వీకరించారు. సొసైటీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపణలు రావడంతో పాలకవర్గాన్ని రద్దుచేస్తు సుమారు మూడు నెలల క్రితం కమిషనర్ ఉత్తర్వ్యులు జారీ చేశారు. ఈక్రమంలో శ్రీనివాసరావు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పాలకవర్గం రద్దుపై హైకోర్టు స్టే ఇచ్చింది. నాలుగు నెలల కాలానికి లేదా మేనేజింగ్ కమిటీకి ఎన్నికలు నిర్వహించేంతవరకు ఏది ముందు అయితే అంత వరకు సొసైటీ వ్యవహారాలు నిర్వహించేందుకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వ్యులు జారీ చేశారు. దీంతో బుధవారం బడేటి శ్రీనివాసరావుతోపాటు ఎనిమిది మంది సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

## పంజాబ్ మహా కిసాన్ సభకు నల్లమల



రైతు సభలో ప్రసంగిస్తున్న నల్లమల

ఖమ్మం మార్కెట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి); పంజాబ్ రాష్ట్రంలోని లుధియానాలో జరుగుతున్న మహా కిసాన్ పంచాయత్‌లో నగరానికి చెందిన కాంగ్రెస్ నేత, సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు, భూసేకరణ చట్టం, ప్రపంచ వాణిజ్య ఒప్పందం, స్వామినాథన్ కమిషన్ ఆమోదం, మద్దతు ధరలకు చట్టబద్ధత తదితర అంశాలపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి దేశంలోని అన్ని రాష్ట్రాల రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఉధృతంగా
## ప్రవహిస్తున్న బుగ్గవాగు



కామేపల్లి, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండలం బండిపాడు స్టేజీ వద్ద బుగ్గవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో డోర్నకల్-ఖమ్మం రహదారి రాకపోకలు నిలిచిపోయాయి. గత రెండు రోజులనుంచి కురుస్తున్న వర్షాలకు బ్రిడ్జిపై నాలుగు అడుగుల మేరకు నీరు ప్రవహిస్తుంది. దీంతో ముందస్తు చర్యలో భాగంగా రెవెన్యూ, పంచాయతీరాజ్ కలిసి ఉధృతిని సమీక్షించారు. తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రవీందర్ తదితరులు ఉన్నారు.



ఆంధ్రజ్యోతి
ZONE
శుక్రవారం 8 ఆగస్టు 2025
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY



## సీపీఎం సంతకాల సేకరణతో మునిసిపల్ సిబ్బందిలో కదలిక

వైరా, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో సమస్యలపై సీపీఎం చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంతో మునిసిపల్ అధికారులు, సిబ్బందిలో కదలిక వచ్చింది. గత ఐదురోజులుగా ఆరో వార్డు సుందరయ్యనగర్‌లో వివిధ సమస్యలపై సీపీఎం ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టింది. సుందరయ్యనగర్‌లోని కొన్ని వీధుల్లో వీధిదీపాలు వెలగటం లేదని ప్రజలు సీపీఎం నాయకులకు వివరించారు. ఆవెంటనే మాజీ ఎంపీపీ బొంతు సమత, నాయకులు కురుగుంట్ల శ్రీనివాసరావు, మల్లెంపాటి ప్రసాద్ ఈ సమస్యలను మునిసిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన మునిసిపల్ అధికారులు, సిబ్బంది వీధిదీపాలు ఏర్పాటుచేశారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణుకు సీపీఎం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## సరస్వతీ దేవి విగ్రహ ఆవిష్కరణ

మధిర,ఆగస్టు(ఆంధ్రజ్యోతి): మధిర టీవీఎం పాఠశాలలో గురువారం సరస్వతి దేవి విగ్రహాన్ని విద్యార్థులు ఆవిష్కరించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గొల్లముడి మల్లిఖార్జున శర్మ తన తల్లి తండ్రులు వెంకట అప్పారావు, సీతారామమ్మ జ్ఞాపకార్థం ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని తల్లి తండ్రులు లేని విద్యార్థులచే ఆవిష్కరింపజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, పూర్వ విద్యార్థుల సంఘం బాధ్యులు పుతుంబాక కృష్ణప్రసాద్, మాధవరపు నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, శ్రీధర్ విగ్రహ దాత గొల్లముడి మల్లిఖార్జున శర్మ పాల్గొన్నారు.

## 'పామాయిల్'కు ప్రభుత్వం ప్రోత్సాహకాలు

కల్లూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రాధాన్యతనిస్తోందని జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్ చెప్పారు. మండల పరిధిలోని దారుగా బంజర గ్రామంలో ఈ ఏడాది నూతనంగా సాగు చేసిన పామాయిల్ పంటను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. మిర్చి నర్సరీలో సాగు చేస్తున్న మొక్కలు మంచి నాణ్యతతో ఉన్నాయని చెప్పారు. జిల్లాలో 34 వేల ఎకరాల్లో పామాయిల్ తోటలు సాగులో ఉన్నాయని, ఈ ఏడాది మరో 14,500 ఎకరాలు పామాయిల్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ పంటను సాగు చేస్తే రైతులకు ఎకరానికి రూ.50 వేల వరకు ప్రభుత్వ సబ్సిడీ రూపంలో నాలుగు సంవత్సరాల పాటుగా అందిస్తుందన్నారు. మొక్కల కొనుగోలుకు రూ.11,600, డ్రిప్ ఇరిగేషన్‌కు రూ.22 వేలు, అంతర పంట సాగుకు మరో రూ. 16,800, రైతుల ఖాతాల్లో జమా చేయటం జరగుతుందన్నారు. రైతులకు అందుబాటులో ఉండేలా జిల్లాలో అశ్వారావుపేట, వేంసూరు (కల్లూరిగూడెం) వైరా (గుబ్బగుర్తి) ప్రాంతాల్లో పామాయిల్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. గత ఏడాదిలో మిర్చికి చీడపీడలు ఆశించటం, గిట్టుబాటు ధర పడిపోవటంతో ఈ ఏడాది మిర్చి సాగు గణనీయంగా తగ్గనున్నందున రైతులు పామాయిల్ అంతర పంటల వైపు దృష్టి సారించే ఆవకాశం ఉందన్నారు. మరో వైపున కోతుల బెడద కూడా ఉండదన్నారు. ఈ కార్యకమంలో రైతులు సూరంపల్లి లక్ష్మినారాయణరావు, ఎస్‌కే ఖాదర్ పాల్గొన్నారు.

## అనారోగ్యంతో పెద్దగోపతి గ్రామదీపిక మృతి

కొణిజర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దగోపతి గ్రామానికి చెందిన గ్రామదీపిక తడికమళ్ల రమాదేవి(45) గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. రమాదేవి జ్వరంతో పాటు ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ మృతి చెందింది. భర్త తడికమళ్ల రమేష్ మూడు సంవత్సరాల క్రితం మరణించాడు. అప్పటి నుంచి రమాదేవి తన ఇద్దరు కూతుర్లు రేణుక, మౌనికలను చదివించుకుంటూ కష్టపడుతుంది. కూతుర్లు రేణుక బీటెక్ పూర్తి కాగా, మౌనిక నర్సింగ్ చదువుతోంది. తండ్రితోపాటు ఇప్పుడు తల్లి కూడా చనిపోవడంతో ఇద్దరు కూతుర్లు బోరున విలపిస్తున్నారు. గ్రామస్థులంతా వారిని చూస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. రమాదేవి గ్రామదీపకగా పని చేస్తుండటంతో కాంగ్రెస్ పీసీసీ సభ్యులు వడ్డే నారాయణరావు, గ్రామ మాజీ సర్పంచ్ తాళ్లూరి చిన్నపుల్లయ్య, తడికమళ్ళ దానియేలు, మాజీ ఎంపీటీసీ వడ్డే రమాదేవి తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## ఘనంగా కూసంపూడి మహేష్ బర్త్‌డే



బర్త్‌డే కేక్ కట్‌చేస్తున్న కూసంపూడి మహేష్

సత్తుపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మునిసిపల్ మాజీ ఛైర్మన్ కూసంపూడి మహేష్ పుట్టిన రోజు వేడుకలు గురువారం సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య క్యాంప్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానుల మధ్య బర్త్‌డే కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండడంతోపాటు ఛైర్మన్‌గా మునిసిపాలిటీని అభివృద్ధి చేసి రాష్ట్ర చిత్రపటంలో నిలిపడంతో చిరస్థాయిగా నిలిచారని నాయకులు అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మల్లూరు అంకంరాజు, అయూబ్‌పాషా, తడికమళ్ల ప్రకాశరావు, అమరవరపు కృష్ణారావు, చంటి, మేకల నరసింహారావు, విజయ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## నేరుగా వెదజల్లే పద్ధతిపై అవగాహన

మధిర రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వెదజల్లే పద్ధతిలో సాగు చేయడం వల్ల కూలీ ఖర్చు, నారు ఖర్చు, సమయాన్ని అధిగమించవచ్చునని మధిర క్లస్టర్ ఏఈవో టి.జిష్ణు పేర్కొన్నారు. గురువారం బాజినేని నాగరాజుకు చెందిన పొలంలో వరి విత్తనాలు నేరుగా వెదజల్లే పద్ధతిపై అవగాహన కల్పించారు. ఈ పద్ధతిలో 12నుంచి 15కిలోల విత్తనం సరిపోతుందని, రైతులకు నారుమడికి అయ్యే ఖర్చు తగ్గుతుందన్నారు. నీటి వినియోగాన్ని 30నుంచి35 శాతం తగ్గించవచ్చునని, 10నుంచి 15రోజుల ముందుగా కోతకు వస్తుందని, ఎకరాకు ఆరువేల నుంచి రూ.ఎనిమిదివేల వరకు ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు. రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాలు వితరణ

ఎర్రుపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మంలంలోని వెంకటాపురం జిల్లాపరిషత్ ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి గురువారం నోటుపుస్తకాలను వితరణ చేశారు. రూ.20వేల విలువగల నోట్ పుస్తకాలు, పెన్నులను అందించారు. తన స్వగ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చేయూతనివ్వడం ఆనందంగా ఉందన్నారు. రాజుపాలెం సొసైటీ అధ్యక్షుడు వెన్నపూస కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్నాటి సుధాకర్‌రెడ్డి, బూసుపల్లి వెంకటరెడ్డి, మేకల రమేష్, జగన్మోహన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎర్రుపాలెంలో జిల్లా అటవీశాఖ అధికారి పర్యటన

ఎర్రుపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రంసింగ్ గురువారం పర్యటించారు. డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలతో గ్రామాల్లో బీటీ రోడ్డు నిర్మాణం కోసం అటవీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహించారు. రూ.6.50 లక్షలతో అయ్యవారి గూడెం నుంచి బుచ్చిరెడ్డిపాలెం వరకు 7కి.మీ. రోడ్డు నిర్మాణానికి 400మీటర్లు, రూ.16కోట్లతో బీమవరం నుంచి కాచవరం వరకు 8కి.మీ. రోడ్డు నిర్మాణానికి 4.5కి.మీ. అటవీశాఖ భూమి అవసరం ఉందని ఆయన తెలిపారు. ఈ రోడ్ల నిర్మాణం అనుమతులు మంజూరు కోసం నివేదికను తయారు చేసినట్లు ఆయన తెలిపారు. అటవీ భూముల నుంచి గ్రామాల్లో రోడ్లు నిర్మాణం చేసే సందర్భంలో అనుమతలు కోసం కొంత ప్రభుత్వ భూమిని తీసుకుని దానిలో మొక్కలను నాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ ప్రతిపాదనల కోసం జాయింట్ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. పంచాయతీరాజ్‌శాఖ ఈఈ మహేష్, ఎఫ్‌డీవో వెంకన్న, ఎఫ్ఆర్వో శ్రీనివాస్, పంచాయతీ రాజ్ జేఈ నరేష్, కాంగ్రెస్ నాయకులు అనుమోలు కృష్ణారావు పాల్గొన్నారు.

# తల్లిపాలలో సంపూర్ణ పోషకాలు

» పిల్లల ఆరోగ్యానికి తల్లి పాలే ప్రధానం

పెనుబల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లిలోని నాల్గో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం నిర్వహించారు. సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ టీచర్ కృష్ణకుమారి, ఆయా లక్ష్మీ, ఆశవర్కర్లు పాల్గొన్నారు. అలాగే ముత్తగూడెం సర్కిల్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.

తల్లాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలలో సంపూర్ణ పోసకాలు ఉంటాయని ఐసీడీఎస్ కల్లూరు సీడీపీవో నిర్మలజ్యోతి తెలిపారు. గురువారం తల్లాడ మండలం మల్లవరం గ్రామంలోని రైతువేదికలో సెక్టార్ స్థాయి తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఎంపీఈవో సురేష్‌బాబు, పల్లెదవాఖాన వైద్యుడు డాక్టర్ బి.శ్రీకాంత్, సూపర్‌వైజర్లు సత్యవతి, రోజాకుమారి, పంచాయతీ కార్యదర్శి సిద్దిక్‌మియా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వేంసూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీరాపల్లి సెక్టార్ పరిధిలోని అడసర్లపాడు గ్రామంలో గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఐసీడీఎస్ సీడీపీవో మెహరున్నీసా బేగం మాట్లాడుతూ ముర్రుపాలను బిడ్డకు ఆరునెలల వరకు పట్టించాలని అలాగే ఆరునెలల నుంచి రెండు సంవత్సరాల వరకు అనుబంధ ఆహారం బిడ్డకు ఇస్తూ తల్లిపాలు కొనసాగించాలని సూచించారు. అనంతరం 9మంది గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఏఎన్‌ఎంలు శ్రీలక్ష్మీ, ఆషా, అంగన్‌వాడీ టీచర్లు విజయకుమారి, పద్మావతి, శాలిని, నిర్మల, వెంకటమ్మ, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

కల్లూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్లపాడు, చండ్రుపట్ల గ్రామాల్లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్వాడి కేంద్రాలు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని గర్భిణీలకు, బాలింతలను, యుక్త వయస్సు బాలికలను సూచించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు, చండ్రుపట్ల సూపర్వైజర్లు వెంకటమ్మ, సూజాత, పంచాయితీ కార్యదర్శి ఏకలక్ష్మీ, ఏఎన్‌ఎంలు అంగన్వాడి టీచర్లు పుష్పలత, సత్యవతి, జ్యోతి, పద్మ, జ్యోతిపుష్ప, యశోద తదితరులు పాల్గొన్నారు. అధికారులు



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ



సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం



వారోత్సవాలపై ప్రదర్శన చేస్తున్న దృశ్యం

## సీజనల్ వ్యాధులపై సమీక్ష



మాట్లాడుతున్న మున్సిపాలిటీ కమిషనర్

కల్లూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మునిసిపాలిటిలో గురువారం సీజనల్ వ్యాధులపై అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపాలిటి కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. మునిసిపాలిటి పరిధిలో గల గ్రామాల్లో మురుగు నీరు నిల్వ ఉండడం, చెత్తాచెదారం ఉండడం వంటి ప్రాంతాలను గుర్తించామని వాటి దగ్గర తక్షణమే ఆయిల్ బాల్స్ వేయాలని, నిరుపయోగంగా ఉన్న గృహాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించేలా ప్రణాళికలను రూపొందించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, రిసోర్స్ పర్సన్లు క్షేత్రస్థాయిలో సందర్శించి ఇంటి పరిశుభ్రతను, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలని కోరారు. మునిసిపాలిటి మేనేజర్ నాగేశ్వరరావు, పర్యవేక్షకులు రామారావు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్వాడిలు పాల్గొన్నారు.

## లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం



మాట్లాడుతున్న తహసీల్దార్

సత్తుపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): భూభారతి ద్వారా భవిష్యత్‌లో జరగబోయే భూమి సర్వే కోసం సత్తుపల్లి మండలానికి 21మంది లైసెన్స్ సర్వేయర్లను ప్రభుత్వం నియమించింది. ఈ క్రమంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అప్రంటీషిప్‌లో భాగంగా 40రోజుల పాటు శిక్షణ పొందనున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. జిల్లా మొత్తం మీద 647మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు 60రోజుల పాటు శిక్షణ అనంతరం సత్తుపల్లికి కేటాయించిన 21మంది రాగా వీరికి మండల సర్వేయర్లు తిరపతయ్య, నాగులు శిక్షణ ఇవ్వనున్నారు.

తల్లాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలానికి 21మంది కాంట్రాక్ట్ సర్వేయర్లు నియమితులయ్యారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సంబంధిత సమస్యలు పరిష్కారం కోసం సర్వేయర్ల నియామకం జరిగినట్లు తహసల్దార్ వి.సురేష్‌బాబు తెలిపారు. సర్వేయర్లు బాధ్యతలు స్వీకరించారు.

### అర్హులకే ఇల్లు మంజూరు చేయాలి

చింతకాని, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి నిరుపేద, వికలాంగ, వృద్ధులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేయాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు కోరారు. గురువారం మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీలు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని నాగులవంచ గ్రామంలో పది ఎకరాలు ఉన్న భూస్వాములకు, కాంగ్రెస్ నాయకులకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చారన్నారు. రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలస్యం రవి, కందరుబోయిన కొండలరావు, రైతు అప్పారావు, యరదేశి గోపాలరావు, భైరు రామయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ కరపత్రాల పంపిణీ: బీజేపీ

చింతకాని, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ముద్రించిన కరపత్రాలను మండల కేంద్రంలో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు కొండా గోపి ఆధ్వర్యంలో గ్రామస్థులకు పంపిణీ చేశారు. నాయకులు జ్వాల నరసింహారావు, మండదపు సుబ్బారావు, మద్దినేని వెంకటేశ్వర్లు, కొరిపల్లి శ్రీను, రామారావు, నాగచారి పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఇంటికి తెలియజేసేలా ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సాలి శివకృష్ణ పిలుపునిచ్చారు. విష్ణు, జమలయ్య, లీలావతి, పమ్మి నరసింహారావు, లక్ష్మీనారాయణ, రహ్మతుల్లా, వసంతరావు, తులసీరామ్, కిషోర్ పాల్గొన్నారు.

మధిర రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి కె.విజయరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మధిర మండలం నిధానపురం గ్రామంలో ప్రతి గడపగడపకు బీజేపీ పార్టీని తీసుకువెళ్లే దానిలో భాగంగా మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు గడ్డం శ్రీహరి చౌదరి, పెరుమాళ్ల పల్లి విజయరాజు, ఏలూరి నాగేశ్వరరావు, గుండా చంద్రశేఖర్‌రెడ్డి, శివరాజు సుమంత్, చిలివేరు సాంబశివరావు పాల్గొన్నారు.




కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

### కస్తూర్బాకు నిలిచిన గుడ్ల సరఫరా

పెనుబల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలం గౌరారంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు రెండు రోజులుగా కోడిగుడ్ల సరఫరా నిల్చిపోవడంతో కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ పరిశీలనలో విద్యార్థినులు తెలిపారు. గురువారం గౌరారంలో ఉన్న ఆ పాఠశాలను కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ దయానంద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి విద్యార్థినులు పలు సమస్యలను తీసుకువెళ్లారు. జూనియర్ కళాశాలను ప్రారంభించినప్పటికీ విద్యార్థినులకు సరిపడా బాత్‌రూంలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. విద్యార్థినులకు వడ్డించిన భోజనాలతోపాటు పాఠశాల, కళాశాలకు సరఫరా చేసిన కూరగాయలు, సరుకులను పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి, సోమరాజు సీతారామారావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పసుమర్తి విశ్వనాథ్, ప్రకాష్, నాగరాజు పాల్గొన్నార ు.

## యూరియా కోసం రైతుల తిప్పలు

కారేపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్ సాగు ఉధృతంగా కొనసాగుతున్న తరుణంలో రైతులను యూరియా కొరత వేధిస్తోంది. గడచిన వారం రోజులుగా మండల కేంద్రంలోని సహకార సొసైటి కార్యాలయం వద్ద తెల్లవారుజామునుంచే రైతులు, మహిళలు యూరియా కోసం క్యూకడుతున్నారు. దీంతో గంటల కొద్ది క్యూలైన్లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పాడిందని పలువురు మనోవేదనతో వాపోతున్నారు. యూరియా సరఫరా విషయంలో ప్రభుత్వం మరింత చొరవ తీసుకుని రైతులకు అవసరమైన యూరియాను అందచేయాలని రైతులు కోరుతున్నారు.



క్యూలైన్లో నిల్చున్న మహిళా రైతులు

### నానో యూరియా వాడకాన్ని పెంచాలి: ధనసారి పుల్లయ్య

చింతకాని, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసారి పుల్లయ్య అన్నారు. నానో యూరియా వినియోగంపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏడీఏ విజయచంద్ర, ఏవో మానస, ఏఈవోలు రాము, కళ్యాణి రైతులు పాల్గొన్నారు.

### మహిళపై దాడి: కేసు నమోదు

చింతకాని, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన జక్కుల విజయకుమారిపై అదే గ్రామానికి చెందిన కణతాల నాగేంద్రబాబుతోపాటు మరికొంత మంది గురువారం అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి దాడి చేసి గాయపర్చారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చింతకాని, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కనుమూరి అంజయ్య (42) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన అంజయ్య బుధవారం రాత్రి మద్యం సేవించి ఇంట్లో ఉన్న గడ్డి నివారణ మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని కుమారుడు ఆకాష్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పలువురిని పరామర్శించిన తమ్మినేని

వైరా, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం వైరాలో గురువారం విస్తృతంగా పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు, సోమవరం మేజర్ గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ తాండ్ర పెద్ద బ్రహ్మంను పరామర్శించారు. అలాగే సీపీఎం పట్టణ నాయకుడు కొంగర సుధాకర్ తల్లిదండ్రులు కొంగర సీతరామయ్య, లక్ష్మీకాంతమ్మలను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. తమ్మినేని వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు, నాయకులు సుంకర సుధాకర్, తాళ్లపల్లి కృష్ణ, మేరుగు సత్యనారాయణ, చింతనిప్పు చలపతిరావు, బొంతు సమత, కొంగర సుధాకర్, గుమ్మా నర్సింహారావు, పైడిపల్లి సాంబశివరావు, మల్లెంపాటి ప్రసాదరావు, తోట కృష్ణవేణి, కురుగుంట్ల శ్రీనివాసరావు, చావా కళావతి, గుడిమెట్ల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### లోఓల్టేజీ సమస్య తలెత్తనివ్వొద్దు: ఏడీఈ

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఎక్కడా ఓల్టేజీ సమస్య తలెత్తనివ్వొద్దని సత్తుపల్లి ఏడీఈ ప్రసాద్‌బాబు సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని కాకర్లపల్లిలో 2ట్రాన్స్‌ఫార్మర్ల తోపాటు స్తంభాలను ఏర్పాటు చేశారు. సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తేవాలని, వర్షాకాలం దృష్ట్యా రైతులు జాగ్రత్తగా ఉంటూ సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖకు రైతులు, గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కావ్య, ఎల్‌ఐఈ రామారావు, అసిస్టెంట్ లైన్‌మెన్ చంద్రశేఖరరావు, గ్రామస్థులు కొప్పుల నాగేశ్వరరావుతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో హైకోర్టు న్యాయవాది మృతి

కారేపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గేటుకారేపల్లికి చెందిన హైకోర్టు న్యాయవాది పరస అనంతనాగేశ్వరరావు(45)గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. వృత్తిరీత్యా గురువారం ఉదయం హైకోర్టుకు వెళ్లిన నాగేశ్వరరావు కోర్టు కేసులను పరిశీలిస్తున్న సమయంలోనే గుండెపోటు వచ్చి కోర్టు ప్రాంగణంలోనే కుప్పకూలిపోయాడు. దీంతో కోర్టులో ఉన్న పలువురు లాయర్లు, సిబ్బంది హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేశారు. కాని అప్పటికే ఆయన మృతి చెందాడు. పేద కుటుంబంలో పుట్టిన అనంత నాగేశ్వరరావు కష్టపడి చదువుకుని హైకోర్టు న్యాయవాదిగా ఎదిగాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. నాగేశ్వరరావు అకస్మీకమృతితో గేటుకారేపల్లిలో తీవ్రవిషాదచాయలు అలుముకున్నాయి.

### నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించాలి

ముదిగొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11వతేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అరుణాదేవి తెలిపారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ లక్ష్మీ, ఎంఈవో రమణయ్య, ఏవో సరిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయరాజు, పశువైద్యాధికారి అశోక్ పాల్గొన్నారు.

## కోతుల బెడదను నివారించండి

మధిర, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో కోతుల బెడదను నివారించాలని బీజేపీ నాయకులు గురువారం మధిర మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కోతులు అనేక మందిని గాయపరిచాయని మునిసిపల్ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని కోతులను పట్టించి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. పట్టణ అధ్యక్షులు శివరాజు సుమంత్ నాయకులు పాపట్ల రమేష్, శిలివేరు సాంబ, రామిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బనిగండ్లపాడులో ప్రభుత్వ వైద్యశిబిరం

ఎర్రుపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో గ్రామంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరం, జలుబు, దగ్గు వంటి వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న 57మందిని పరీక్షించి వారికి ఉచితంగా మందులు అందించారు. ప్రస్తుత వర్షాకాలంలో డెంగీ, చికెన్‌గున్యా, టైఫాయిడ్, అతిసారం వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామస్థులు వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కార్తీక్, హెల్త్‌సూపర్‌వైజర్ లతశ్రీ, హెల్త్ అసిస్టెంట్ అశోక్, ఏఎన్‌ఎం రత్నమ్మ, ఆశాకార్యకర్తలు ధనలక్ష్మి, సుధ, రమాదేవి, హైమావతి, విమలకుమారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.